# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 17 సంచిక : 1 జనవరి - ఫిబ్రవరి 2024 విడి ప్రతి వెల రూ. 5/- సం॥ర చందా రూ॥ 100/-


## నా మంచి కాపరి


- జాయ్ చెరియన్


*సంపాదకురాలి కలమునుండి...*

23వ కీర్తనద్వారా పరిశుద్ధాత్మ దేవుడు ఎన్నో నిగూఢమైన మర్మములు, సత్యములు బయలుపరుస్తాడు. ఒక మంచి కాపరియొక్క లక్షణములన్నీ దేవుని సహాయంద్వారా గ్రహిస్తాము. నాదొక చిన్న మనవి – ఈ క్రొత్త సంవత్సరం ప్రతిరోజు ఉదయం లేవగానే ఈ కీర్తన చదవండి; మీకు ఏ కీడు రాదు. ఇందులో అర్థవంతమైన ఆరు వచనాలు ఉన్నవి. దావీదు గొఱ్ఱెల కాపరి. దేవుడు గొఱ్ఱెల దొడ్డిలోనుండి అతని పిలుచుకున్నాడు. అతడు ఇశ్రాయేలుకు మహారాజుగా ఉండి ప్రజలను ఏలాడు. దేవుడు అతనికి అంత ఔన్నత్యాన్ని ఇవ్వడానికి దేవునికి ఇష్టమైంది. దేవుడు ఎవరినైనా దీనస్థితినుండి ఉన్నతస్థితికి లేవనెత్తగలడు. దేవుడు దావీదును ఎలా దీవించాడో చూద్దాం.

**"తాను అంతరిక్షమును కట్టినట్లు తాను భూమిని నిత్యముగా స్థాపించినట్లు ఆయన తన పరిశుద్ధమందిరమును కట్టించెను. తన దాసుడైన దావీదును కోరుకొని గొఱ్ఱెల దొడ్లలోనుండి అతని పిలిపించెను. పాడిగొఱ్ఱెలను వెంబడించుట మాన్పించి తన ప్రజలైన యాకోబును, తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలును మేపుటకై ఆయన అతనిని రప్పించెను. అతడు యథార్థహృదయుడై వారిని పాలించెను కార్యములయందు నేర్పరియై వారిని నడిపించెను."** – కీర్తనలు 78:69-72

దావీదు ఎక్కడినుండి ఎక్కడికి హెచ్చింపబడ్డాడు. తానొక కాపరి కాబట్టి 23వ కీర్తన వ్రాయడానికి మంచి అనుభవం కలిగియున్నాడు. అనుభవం ఉన్నవాళ్లు ఏదైనా మాట్లాడితే వినసొంపుగా జ్ఞానయుక్తంగా ఉంటుంది. అనుభవం లేనివారు ఏదైనా చెబితే అది వేరుగా ఉంటుంది. కాపరిగా గొఱ్ఱెలను మేపే అనుభవం అతనికి ఉంది. మంచి కాపరి గొఱ్ఱెలను పచ్చికగల చోట్ల, జలములయొద్దకు నడిపించడం, గొఱ్ఱెల ప్రాణానికి సేదదీర్చడం, చక్కని మార్గాల్లో నడిపించడం చేస్తాడు. లోయల గుండా వెళ్లినప్పుడు అక్కడ క్రూరమృగాలైన నక్కలు, తోడేళ్లు గొఱ్ఱెలను భక్షించుటకు కాచుకొని ఉంటాయి; ముళ్ల తుప్పలు ఉంటాయి. అటువంటి మార్గాల గుండా వెళ్లవలసివచ్చినా కాపరి గొఱ్ఱెలు ఏ కీడుకు గురికాకుండా ముందు, వెనుక శ్రద్ధ వహించి దుడ్డుకఱ్ఱ దండముతో కాపాడుతూ భయభీతులు లేకుండా అడవి మృగాలకు ఎర కాకుండా భద్రముగా చూసికొంటాడు. ఒక కాపరికి గొఱ్ఱెలకు మధ్య చక్కని అనుబంధం ఉంటుంది.

నేను గొఱ్ఱెల కాపరి కుటుంబమునుండి ఆరాధనకు వచ్చిన ఒక కురుమ అమ్మాయిని పిలిచి అన్నీ తెలిసికొన్నాను. ఆమె – మా నాన్నగారు ఒక కాపరి; మాకు వంద గొఱ్ఱెలు ఉన్నాయి. మా నాన్న ప్రతి గొఱ్ఱెను ఒక శబ్దంతో పిలిస్తే ఆ గొఱ్ఱెయే స్పందిస్తుంది. ఆయనకు ప్రతి గొఱ్ఱె స్వభావం తెలుసు. ప్రతిరోజు వంద గొఱ్ఱెలను మేపి ఏ అపాయం రాకుండా కాపాడి సంరక్షిస్తాడు. రాత్రి గొఱ్ఱెలన్నీ నిద్రపోయినప్పుడు కాపరి గొఱ్ఱెల కొట్టం దగ్గర దండము పట్టుకొని కునుకురాకుండా చాలా జాగ్రత్తగా ఉంటాడు అని చెప్పింది. ఈ గొఱ్ఱెలకు కాపరి ఇంతగా కాపుదల ఇస్తున్నాడు గదా! పరిశుద్ధ గ్రంథములో దేవునిగూర్చి ఈలాగు వ్రాయబడి ఉంది. **"ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు."** – కీర్తనలు 121:4

23వ కీర్తన చదివినప్పుడు విశ్వాసి దేవునితో కలిగియున్న సంబంధం ఎటువంటిది; అతడు ప్రతిరోజు దేవుని ప్రేమ, కాపుదల, పోషణ, భద్రత, సంరక్షణ ఏలాగు అనుభవిస్తున్నాడో బోధపడుతుంది. ఈ కీర్తన చదివినప్పుడు ఏ భయం లేకుండా నా హృదయం దేవునియందు హర్షించింది. కావున దేనినిగూర్చి కలవరపడకుండ ప్రతిరోజు **"యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు."** అని పలకాలి. యేసుక్రీస్తు నీకు కాపరి, నీకు లేమి కలుగదు. నిన్ను ఏ విధంగా నడిపించాలి? ఏ దిక్కునకు మళ్లించాలి? ఏమి ఇచ్చి నిన్ను పోషించాలి? ఏలాగు నీ ప్రాణమునకు ఆదరణ కలిగించాలి? నీ గాయాలు ఎలా మాన్పాలి? నీ రోగానికి ఏలాగు సపర్యలు చేయాలి? వీటన్నిటిని చూసికొనుటకు కాపరి గొప్ప జ్ఞానము కలిగియున్నాడు. అందుకే పరిశుద్ధ గ్రంథములో చూసినప్పుడు దేవుడు ఒక కాపరిగా, దేవుని ప్రజలు గొఱ్ఱెలుగా మనకు కనబడుతుంది. **"ఆయన మన దేవుడు మనము ఆయన పాలించు ప్రజలము ఆయన మేపు గొఱ్ఱెలము."** – కీర్తనలు 95:6. కొందరు లోకస్థులు క్రైస్తవులను చూసినప్పుడు ''ఇదిగో గొఱ్ఱెలు గొఱ్ఱెలు'' అని సంబోధించడం యూట్యూబ్‌లో చూశాను. అవును మనము గొఱ్ఱెలమే. ఆయన మన దేవుడు; మనము ఆయన పాలించు ప్రజలము, ఆయన మేపెడు గొఱ్ఱెలము. దేవుడు ఈరోజు 23వ కీర్తనద్వారా మనతో మాట్లాడనై యున్నాడు.

మంచి కాపరియైన యేసుప్రభువు గురించి వాక్యంలో స్పష్టంగా ఉంది. **"దొంగ దొంగతనమును హత్యను నాశనమును చేయుటకు వచ్చును గాని మరి దేనికిని రాడు; గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును."** – యోహాను 10:10,11. ప్రభువు – నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని అని చెబుతున్నాడు. అంటే చెడ్డ కాపరులుకూడా ఉంటారని,

యెహెజ్కేలు 34వ అధ్యాయము చదివితే అసలైన కాపరులు ఎవరు? దొంగ కాపరులు ఎవరు? ఎవరు మిమ్మును ప్రేమిస్తున్నారు? ఎవరు మీకున్నదంతా ఒలుచుకుంటున్నారు? ఎవరు మీపై శ్రద్ధ వహిస్తున్నారు? అని స్పష్టంగా అర్థం అవుతుంది. మంచి కాపరులు – చెడ్డ కాపరులు, స్వార్థపరులు – త్యాగం చేసే కాపరులు ఉన్నారు. **"నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును."** – యోహాను 10:27. అవి మరే ఇతర స్వరాన్ని వినవు. లోకంలో నీకు ఎన్నో స్వరాలు వినబడుతుంటాయి. మీరు దేవుడు మేపే గొఱ్ఱెలైతే మీరు ప్రభువు చెప్పేదాన్నే వింటారు. **"నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక నా తండ్రి చేతిలోనుండి యెవడును వాటిని అపహరింపలేడు."** – యోహాను 10:28,29. ఇక మనకు భయమెందుకు? ఆయన మన కాపరిగా ఉండి తన స్వరం వినిపిస్తూ మన అవసరము తీరుస్తున్నాడు. మనం ఆయన చేతిలో ఉన్నామని, మనల్ని తండ్రి చేతిలోనుండి అపహరించుటకు ఎవరికీ సాధ్యం కాదంటున్నాడు. ఈ క్రొత్త సంవత్సరంలో 366 రోజులు **"యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు"** అని పలకండి. యేసుప్రభువు కాపరిగా ఉన్న జీవితాల్లో భయం, చింత, కలవరం, కలహం ఉండదు. కాపరి ఎప్పుడూ గొఱ్ఱెలతోనే ఉంటాడు. గొఱ్ఱెలకు కాపరి సన్నిధి ధైర్యాన్నిస్తుంది. కాపరి స్వరం విన్నప్పుడు గొఱ్ఱెల అలజడి తొలగిపోతుంది. కాపరి కాకుండా మరే ఇతర స్వరాన్ని అవి వెంబడించవు. నేనొక వీడియో క్లిప్పింగ్ చూశాను. దాంట్లో వందల గొఱ్ఱెలున్నాయి. పచ్చిక బయల్లో మేస్తుంటే చాలా మంది రకరకాల శబ్దాలు చేసి పరీక్షిస్తున్నారు. నలుగురైదుగురు వేరే స్వరాలతో పిలుస్తుంటే అందులో ఒక్క గొఱ్ఱెయైనా స్పందించడం లేదు. అంతలో అసలైన కాపరి ఒక కూత వేశాడు. వెంటనే ఎక్కడెక్కడో చెదరియున్న కాపరికి చెందిన మంద పరుగెత్తికొని కాపరి దగ్గరికి వచ్చేసింది.

**"యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేదదీర్చుచున్నాడు తన నామమునుబట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను నీవు నాకు తోడైయుందువు నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును. నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు నూనెతో నా తల అంటియున్నావు నా గిన్నె నిండి పొర్లుచున్నది. నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను."** – కీర్తనలు 23:1–6. ఒక కాపరి తన గొఱ్ఱెలకొరకు ఏమేమి చేస్తాడో ఈ కీర్తనద్వారా అర్థమవుతుంది. కాపరి గొఱ్ఱెలను పచ్చికగల చోట్ల పరుండజేస్తాడు. కాపరి ప్రభువై ఉన్నప్పుడు మీరు ఏ విషయమైకూడా చింతించే అవసరం లేదు. ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, ఏమి ధరించుకొందుమో అని రేపటినిగూర్చిన చింత ఉండదు. కాపరికి గొఱ్ఱెలకు కావలసినవన్నీ ముందే తెలుసు. మనం ప్రార్థిస్తున్నాము; అది మన విధియై యున్నది. దేవుడు మన ప్రార్థనలు విని తప్పక జవాబిస్తాడు. కాని నీవు ఎరుగని ప్రభువు నీకొరకు క్రొత్త కార్యాలుకూడా చేస్తున్నాడు. విశ్వాసులమనే పేరు కలిగిన మనము వెలిచూపువలన గాక విశ్వాసమువలన జీవిస్తున్నాము. కాపరిని విశ్వసిస్తున్న మనం జీవితంలో ఎప్పుడూ ఓడిపోము. ఆయన మనల్ని చక్కగా నడిపిస్తాడు. కాపరి ఎప్పుడూ తన గొఱ్ఱెలకు ముందు నడుస్తాడు; వెనుకకూడా కాపుదల ఏర్పాటు చేస్తాడు. మంచి కాపరి పచ్చికగల చోట్ల నిన్ను పరుండజేసి శాంతికరమైన జలములయొద్ద నడిపిస్తాడు. అప్పుడు గొఱ్ఱెల ఆకలి, దాహం తీరిపోతుంది. నీతికొరకు ఆకలిదప్పులుగలవారిని సహితము దేవుడు తృప్తిపరుస్తాడు.

ప్రాణమునకు నెమ్మది కలిగిస్తాడు. చుట్టూ ఎన్నెన్నో కార్యాలు జరుగుతున్నా విశ్వాసి క్రీస్తులో వేరుపారి నెమ్మదిగా ఉన్నాడు. ఈ కాపరి మనలను నీతిమార్గాల్లో నడిపిస్తున్నాడు. లోకమంతా పాపంతో నిండి ఉంది; విశ్వాసులు పరిశుద్ధ గ్రంథాన్ని పఠిస్తూ, పాటలు పాడుతూ, ఆరాధిస్తున్నారు, కలిసికట్టుగా ప్రార్థిస్తున్నారు. నీ చుట్టు ఉన్న అవినీతికార్యాలేవీ నీమీద ప్రభావం చూపించడం లేదు. ఎందుకంటే కాపరి నిన్ను చక్కని మార్గాల్లో నడిపిస్తున్నాడు. గాఢాంధకారపులోయ అనుభవంలో మరణము సంభవించవచ్చు. గాఢంధకారపులోయలో క్రూర మృగాలు, విషసర్పాలు, నక్కలు ఉంటాయి. వీటన్నిటి బారినుండి నీ ప్రాణమును కాపాడేది మంచి కాపరి. నీ పరిస్థితులు తారుమారైనా కాపరి నిన్ను భద్రముగా కాపాడుతాడు. కాపరి నీకు తోడైయుండి దుడ్డుకఱ్ఱ దండముతో నిన్ను ఆదరిస్తాడు. దుడ్డుకఱ్ఱతో ఆహారము అందిస్తాడు; దండముతో క్రమశిక్షణ నేర్పుతాడు. గొఱ్ఱెలు చాలా సాధుజంతువులు ఎటంటే అటు వెళ్లిపోతాయి. వెళ్లిపోయాక కొట్టానికి చేరడానికి వాటికి దారి తెలియదు. వాటికి స్వంత తెలివి, జ్ఞానం ఉండదు. కాపరి చెప్పినట్టే అవి వింటాయి. ప్రతి గొఱ్ఱెకు ఒక కాపరి కావాలి. లేకుంటే లోకనటనలో కొట్టుకొని వెళ్లిపోతావు. గొఱ్ఱెలు చెట్లు ఎక్కలేవు, ఎగర లేవు కాబట్టి కాపరి దుడ్డుకఱ్ఱతో చెట్టుకొమ్మలను వంచి గొఱ్ఱెలకు మేత వేస్తాడు. మరి దండమునేదేనికి? కొన్నిసార్లు మొండి గొఱ్ఱెలు కాపరినే పొడుస్తాయంట. దాన్ని బ్లాక్‌షీప్ అంటారు. అన్నీ ఒకతీరు ఉంటే ఇది మరొక తీరు ఉంటుంది. అలాంటి దాన్ని సాధు చేయడానికి దండము వాడుతాడు. జీవితంలో మనకు కొన్నిసార్లు శిక్షలు, నొప్పులు, బాధలు కలుగుతాయి. వాటిద్వారా దేవుడు మనల్ని క్రమములో నడిపిస్తాడు.

శత్రువులయెదుట భోజనబల్ల సిద్ధపరుస్తాడు. గొఱ్ఱెకు శత్రువు ఎవరు? సింహము, తోడేలు. వాటికి గొఱ్ఱె కనబడితే చీల్చి తినేస్తాయి. కాని మంచి కాపరి వీటి బారినుండి గొఱ్ఱెలను కాపాడగలడు. దావీదు భక్తుడు సౌలు రాజుతో – నేను గొల్యాతును చంపడానికి వెళ్తాను; నాకు సింహమును, ఎలుగుబంటిని చంపిన అనుభవం ఉంది అంటాడు. **"అందుకు దావీదు సౌలుతో ఇట్లనెను – మీ దాసుడనైన నేను నా తండ్రియొక్క గొఱ్ఱెలను కాయుచుండ సింహమును ఎలుగుబంటియును వచ్చి మందలోనుండి ఒక గొఱ్ఱెపిల్లను ఎత్తికొని పోవుచుండగ, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆ గొఱ్ఱెను విడిపించితిని; అది నామీదికి రాగా దాని గడ్డము పట్టుకొని దానిని కొట్టి చంపితిని. మీ దాసుడనైన నేను ఆ సింహమును ఎలుగుబంటిని చంపితినే, జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించిన యీ సున్నతిలేని ఫిలిష్తీయుడు వాటిలో ఒకదానివలె అగుననియు, సింహముయొక్క బలమునుండియు, ఎలుగుబంటియొక్క బలమునుండియు నన్ను రక్షించిన యెహోవా ఈ ఫిలిష్తీయుని చేతిలోనుండికూడను నన్ను విడిపించుననియు చెప్పెను. అందుకు సౌలు–పొమ్ము; యెహోవా నీకు తోడుగానుండునుగాక అని దావీదుతో అనెను."** – 1 సమూయేలు 17:34–37

నేను నా గొఱ్ఱెలను కాస్తుండగా సింహము, ఎలుగుబంటి వచ్చాయి; కాని నేను మాత్రం నా గొఱ్ఱెలను సింహము నోటికి గాని ఎలుగుబంటి నోటికి గాని అప్పగించలేదు. సింహముయొక్క బలమునుండి ఎలుగుబంటియొక్క బలమునుండి నేను నా గొఱ్ఱెలను విడిపించి వాటిని కొట్టి చంపానని దావీదు తన అనుభవాన్ని జ్ఞాపకం చేసికొంటున్నాడు. కొందరు విశ్వాసులు ఎప్పుడూ బిక్కుబిక్కుమని భయముతో బ్రతుకు తుంటారు. ప్రక్కింటివారు, ఎదురింటివారు ఏదో చేశారు; నిమ్మకాయ, గుమ్మడికాయ పెట్టారనే పిచ్చి పిచ్చి భయాలన్నీ ఈ క్రొత్త సంవత్సరంలో మానుకోవాలి. యేసుక్రీస్తనే మంచి కాపరి నిశ్చయముగా మీ శత్రువులనుండి మిమ్మును విడిపిస్తాడు. శత్రు బాధ, మంత్రశక్తులు,

తంత్రశక్తులు, చీకటి శక్తులనుండి విడిపిస్తాడు. కునుకక నిద్రపోక కాపాడుతాడు. శత్రువులయెదుట నీ తల ఎత్తుతాడు. కొందరు – వారు అలా అన్నారు; ఇలా చేస్తున్నారు అని శత్రువుల గురించే బాధపడతారు. కాని అవి మిమ్మును ఏమీ చేయవు; దేవుడు నిన్ను నిరంతరము కాపాడుతాడు. ఆయన బాహువులు నిన్ను చుట్టుకొని ఉన్నవి. ఆయన దృష్టి నీపై ఉంది.

నూనెతో నీ తల అంటుతాడు. తలపై నూనె ఎందుకు? కొందరు తలకు అసలు నూనెనే రాయరట. కాని తల మాడు అదరకుండా నూనె రాసుకోవడం మంచిదని వైద్యులు అంటున్నారు. చిన్న బిడ్డలకు మాడు అదరకుండా తలమీద తరచుగా నూనె అంటుతుంటారు. మరియు నూనె అభిషేకానికి సూచనగా ఉంది. మన మంచి కాపరియైన ప్రభువు మనలను ఆత్మతో నింపుతుంటాడు. ప్రతి విధమైన ఆందోళననుండి విడిపిస్తాడు. నీ గిన్నె నిండి పొర్లిపోతుంది. దేవుడు సమృద్ధి కలిగించేవాడు. నీ కాపరి నిన్నుగూర్చి శ్రద్ధ వహిస్తున్నాడు గనుక నీకున్న భయాలన్నీ తొలగించు కోవాలి. కొందరు చాలిచాలని జీతంతో ఇబ్బందులు పడుతుంటారు. నీవు విశ్వాసంద్వారా యేసుప్రభువును కాపరిగా చేసికొంటే సమృద్ధియైన ఆశీర్వాదాలు పొందుతావు. నీవు కాపరి స్వరాన్ని విని కాపరి చిత్తాన్ని జరిగిస్తే నీకు ఏదీ కొదువ చేయదు. ద్వితీయోపదేశకాండము 28:1-14 వచనాల్లో దేవునికి విధేయులైనవారికి సమృద్ధియైన ఆశీర్వాదములు ఉన్నవి. నీవు అప్పు ఇచ్చేవానిగా ఉంటావు; అప్పు తీసికోవు. అయితే ఎక్కడో చిల్లుబడిన జీవితాలు ఉంటాయి; దేవుడు వారికి ఇస్తున్న ఆశీర్వాదాలు ఆ చిల్లుల్లోనుండి కారిపోతుంటాయి. కావున నీవు నీ జీవితాన్ని జాగ్రత్తగా పరీక్షించుకోవాలి.

**"నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను."** – కీర్తనలు 23:6. బ్రతుకు దినములన్నియు ఏడుస్తూ తుడుస్తూ సణుగుతూ కలహిస్తూ కయ్యాల్లో పాలుపొందుతూ జీవించడం కాదు. యేసుప్రభువు నీ కాపరి; నీవు ఆయనను వెంబడిస్తున్నావు గనుక నీకు సమృద్ధియైన జీవము, మేలు ఉంది. నీవు కృపాక్షేమములు అనుభవిస్తావు. సదాకాలము యేసుతో ఉంటావు. మరణమైనా భయము లేదు; చిరకాలము దేవుడు ఉన్నచోట ఉంటాను. అదే నా నివాసస్థలం అని భక్తుడు అంటున్నాడు. దేవునికి స్తోత్రం. మన మంచి కాపరియైన యేసుప్రభువు గురించి ధ్యానించినప్పుడు మనకున్న కలవరమంతా తొలగిపోతుంది.

కాపరికి, గొఱ్ఱెలకు ఒక మంచి బంధము ఉంది. గొఱ్ఱెలు ఒక చోట కాపరి మరొక చోట ఉండవు. కాపరి ఎప్పుడూ గొఱ్ఱెలతోనే ఉంటాడు.

కాపరి గొఱ్ఱెలను చాలా ప్రేమిస్తాడు. కుటుంబం గూర్చికూడా ఆలోచన ఉండదు.

కాపరి గొఱ్ఱెలయొక్క అవసరతలన్నీ తెలిసికొని తీరుస్తాడు.

గొఱ్ఱె రోగముతో ఉన్నప్పుడు కాపరి గొఱ్ఱెను బాగా తడుముతాడు. ఆలాగు తడుముటద్వారా గొఱ్ఱె స్వస్థత పొందుతుంది. ద్వారం దగ్గర కూర్చొని లోనికి వచ్చే ఒక్కో గొఱ్ఱెను తడిమి వాటికి అంటిన పేడ, మురికి తొలగిస్తాడు. కావున నీలో పాపము ఉంటే నీవు కాపరి దగ్గరికి వచ్చి మొఱ్ఱపెట్టుకోవాలి. ఆయన నిన్ను తడిమి, నిమిరి నీకు అంటిన మలినం అంతా తొలగిస్తాడు. రోగముతో ఉన్నప్పుడు పరామర్శిస్తాడు. నిన్ను హత్తుకొంటాడు. చిన్నవాటిని ఆయన రొమ్మున చేర్చుకొంటాడు. భుజముమీద ఎత్తికొంటాడు; పాలిచ్చేవాటిని మెల్లగా నడిపిస్తాడు. ఎంత మంచి కాపరి!

గొఱ్ఱెలను భద్రంగా కాపాడుటకు అహర్నిశలు శ్రమిస్తాడు. గొఱ్ఱెలకు అనారోగ్యత కలిగినా, గొఱ్ఱెకు గాయాలు కలిగినా, గొఱ్ఱెలు తప్పిపోయినా కాపరి సహించలేడు. లూకా సువార్త 15వ అధ్యాయంలో వంద గొఱ్ఱెల్లో ఒక గొఱ్ఱె తప్పిపోతే కాపరి ఆ తొంబైతొమ్మిది గొఱ్ఱెలను వదిలిపెట్టి తప్పిపోయిన గొఱ్ఱెను వెదకుతున్నాడు. నిజమైన కాపరి ఎల్లప్పుడు తప్పిపోయిన దానిని వెదకుతాడు. యేసుప్రభువు – నేను నశించినదానిని వెదకి రక్షించుటకు ఈ లోకానికి వచ్చాను అంటాడు (లూకా 19:10).

కాపరి గొఱ్ఱెలకు ఆహారం, నీరు అందిస్తూ సంరక్షిస్తూ పోషిస్తూ, నీతిమార్గంలో నడిపిస్తున్నాడు. భయకంపితమైన వాతావరణంలో వాటిని పట్టుకొని అభయమిస్తున్నాడు. ఆయన మంచి పోషకుడు కావున నీ ఆత్మ వర్ధిల్లుచున్న ప్రకారం నీవు అన్ని విషయాల్లో వర్ధిల్లడమే దేవుని చిత్తము.

గొఱ్ఱెలకు బొచ్చు పెరిగిపోయినప్పుడు కాపరి వాటికి క్షవరం చేసి మంచి ఆకారంలోకి తీసికొస్తాడు. గాయాలు తగిలిన గొఱ్ఱెలకు మందు రాస్తాడు.

కాపరి దండముతో గొఱ్ఱెలకు శిక్షణనిస్తాడు; దుడ్డుకఱ్ఱతో ఆహారమిస్తాడు క్రూరమృగాలనుండి విడిపిస్తాడు. విశ్రాంతి సమయంలో విశ్రాంతినిస్తాడు. కాపరి ముందు నడుస్తూ గొఱ్ఱెలను తన మార్గాల్లో నడిపిస్తూ ఉంటాడు.

కాపరికి ఎప్పుడు సంతోషం కలుగుతుందంటే, గొఱ్ఱెలు బాగా మేసి ఏ గాయాలు తగిలించుకోకుండా మంచి ఆరోగ్యంతో పుష్టిగా ఉండి చక్కగా విశ్రాంతి తీసికొంటున్నప్పుడు కాపరి ఆనందంతో ఉంటాడు.

కావున విశ్వాసులు భయభీతుల్లో ఉండాల్సిన అవసరం లేదు. గర్భములో రూపింపబడక మునుపే ఆయన మనలను ఎరిగినవాడు. బాల్యం, యౌవనప్రాయం గడిచిపోయినా కాపరివలె ఆయన నీకు తోడున్నాడు; ముదిమి వచ్చువరకు నిన్నెత్తుకొని చంకనబెట్టుకొని నిన్ను రక్షిస్తున్నాడు కావున నీవు భయపడనవసరం లేదు. యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. యేసు నీ కాపరిగా ఉన్నప్పుడు నీకు ఏ అలజడి అవసరం లేదు. ప్రాణంపెట్టిన కాపరి నీకు ఉండగా ఇక నీకు దిగులు, భయం, విచారం, చింత ఎందుకు? ఆ కాపరి ఈ క్రొత్త సంవత్సరంలో నిన్ను నడిపించడా? పోషించడా? రోగం బారిన పడకుండా నిన్ను భద్రంగా కాపడలేదా? ఈ క్రొత్త సంవత్సరంలో క్రొత్త విధానంలో నిన్ను నడిపించలేడా? తప్పకుండా నడిపిస్తాడు. యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. ఆమేన్! పాఠకులకందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ❀



# మెన్స్ సండే

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2023 డిసెంబరు 10వ తేది ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు బాగ్ లింగంపల్లిలోని వి.ఎస్.టి. ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

మెన్స్ మరియు (యూత్) వాలంటీర్స్ స్తుతి ఆరాధనలో పాల్గొని దేవుని నామమును మహిమపరచారు. సంఘ పెద్దలు క్లుప్త వాక్య సందేశాలను అందించారు. బ్రదర్ చంద్రపాల్ గారు దేవుని పని ఏవిధంగా చేయాలి అనే అంశంపై, బ్రదర్ ఆనంద రావు గారు యేసు చేసిన అద్భుతములు అనే అంశముపై, బ్రదర్ సృజన్ కుమార్ గారు దేవుని నామమును ఎరుగనటువంటి వారికొరకు ప్రార్థన అనే అంశముపై (How to pray for unbelivers) మరియు బ్రదర్ క్రిష్ణారెడ్డి గారు ఆత్మలను ఎలా సంపాదించాలి అనే అంశము పై వాక్యాన్ని అందించారు.

మన ఆత్మీయ తల్లిగారైన రెవ. డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు మనము ఈ లోకంలో పౌలువలె విధేయత మరియు క్రమం కలిగి జీవిస్తూ, గురి కలిగి పరుగెత్తాలని తెలియజేసి (2 కొరింథీ 10:10) నుండి వాక్య సందేశాన్ని ఇచ్చారు. సంఘ పెద్దలను అభినందించారు.

పాస్టర్ కృపాకర్ గారు పౌరుషం కలిగి ఉండుడి (Act like mens) 1 కొరింథీ 16:13,14 వాక్యం ద్వారా వర్తమానాన్ని అందించారు.

# దేవుని సహస్రనామములు

## 374. చింతాక్రాంతుడు – మార్కు 14:33

**"వారు గెత్సేమనే అనబడిన చోటునకు వచ్చినప్పుడు, ఆయన – నేను ప్రార్థనచేసి వచ్చువరకు మీరిక్కడ కూర్చుండుడని తన శిష్యులతో చెప్పి పేతురును యాకోబును యోహానును వెంటబెట్టుకొనిపోయి, మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను."**
– మార్కు 14:32,33

చింతాక్రాంతుడనే నామము ధ్యానిస్తున్నాము. సిలువ మరణమునకు ముందు సిలువ శ్రమలు సహించే శక్తిని పొందడానికి ఆయన గెత్సేమనే తోటలో ప్రార్థనలో గడపడానికి పేతురు యోహాను యాకోబులను వెంటబెట్టుకొని వెళ్లాడు. వారిని అక్కడ ఉండమని చెప్పి, కొంతదూరములో మోకరించి మిగుల విభ్రాంతినొందుటకు చింతాక్రాంతుడగుటకు ఆరంభించాడు. మన చింతలు తీర్చడానికి ఆయన చింతాక్రాంతుడయ్యాడు. మన చింతలన్ని సిలువలో ప్రభువు తానే భరించాడు. అందుకే మనము దేనిని గూర్చి చింతించే అవసరములేదని ఆదేశించాడు. ఆయన నిన్ను గూర్చి చింతిస్తున్నాడు గనుక నీ చింతయావత్తు ఆయన మీద వేయాలి. నీ వ్యసనము, దుఃఖము, బాధ అనారోగ్యము నీ చింత ఏదైనా సరే ఆయన మీద వేయడము నేర్చుకోవాలి. ప్రతి చింతను తీర్చడానికే ఆయన సిలువలో చింతాక్రాంతుడయినాడు. ప్రతి వ్యాధిని సిలువలో భరించి వ్యాధిగ్రస్తుడయ్యాడు. మనకు స్వస్థత విడుదల అనుగ్రహించాడు.

ఆయన సర్వశక్తి గల దేవుడు. ఆయనకు చింత ఎందుకు అంటే మన చింతలు తీర్చడానికే. ఆయన మనుష్యరూపములో నూటికి నూరుపాళ్లు మానవుడిగా ఉన్నాడు. లోకపాపములను మోయవలసి వుంది. సర్వమానవాళి పాపపరిహారార్థము నిర్దోషమైన రక్తము చిందింపబడాలి. మన రక్షణార్థము ఆయన సిలువలో చిత్ర హింసలు అనుభవించాల్సి ఉంది. చేదు గిన్నెలోనిది త్రాగాలి అంటే మన పాపములు, వ్యసనములు, దుఃఖములు, రోగములు, చింతలు ఆయన భరించవలసి ఉంది. ఏ పాపమెరుగని పరిశుద్ధుడు మన నిమిత్తము పాపిగా అయ్యాడు. పరమతండ్రితో ఉన్న బంధము విడనాడవలసియుంది. అందుకే ఆయన చింతాక్రాంతుడనే నామముతో దేవుని స్తుతించి ప్రార్థించినపుడు నీ చింతలన్ని వదిలివేయాలి. పిల్లల భవిష్యత్తునుగూర్చి చింత, కుటుంబము గూర్చి చింత, అప్పులు, అనారోగ్యము, ఆర్థిక సమస్యలు, శత్రుబాధ, ఉద్యోగ సమస్యలు నీ చింత ఏదైనా ప్రార్థనలో ప్రభువుకు తెలియజేయాలి. మత్తయి సువార్త 6వ అధ్యాయము 25–34 వచనములలో ఉన్న వాక్యభాగములో యేసు ప్రభువు – మీరు దేనిని గురించి చింతించకూడదని బోధిస్తాడు. వస్త్రమును గూర్చి, ఆహారమును గూర్చి, చింతించే అవసరము లేదు. అవి మీకు అవసరమై యున్నవని మీ పరలోకపు తండ్రికి తెలుసు. ఆయన రాజ్యము నీతిని మొదట వెదికితే సమస్తము అనుగ్రహిస్తాడని బోధిస్తాడు.

**"అందువలన నేను మీతో చెప్పునదేమనగా – ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా? ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్టులు కారా? మీలో నెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతింప నేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా. కాబట్టి – ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటికీడు ఆనాటికి చాలును."**
– మత్తయి 6:25–34

దేవుడు బోధించిన విషయాలు ఆచరిస్తేనే క్రైస్తవ జీవితములో సంతోషముంటుంది. మీరు దేనినిగూర్చి చింతింపకుడి అంటే చింతించవద్దు. ఆయన నీకొరకే చింతాక్రాంతుడయ్యాడు. నీ చింత యావత్తు ఆయన మీద వేసి కేవలము ప్రార్థించడము నేర్చుకోవాలి. అప్పుడు దేవుని దివ్యమైన సమాధానము నీకు తోడుగా ఉంటుంది. దైవికమైన కాంతితో నీ ముఖము వెలిగిపోతుంది. ఆయన వర్తమాన భూతభవిష్యత్కాల చింతలన్నిటిని సిలువలో భరించాడు. చింతించుట పాపముతో సమానము. నీవు చింతిస్తు, భయపడుతున్నావంటే దేవుని శక్తిని అనుమానిస్తున్నావు. నీవు చింతిస్తు విచారముతో ముఖము మాడ్చుకొనియుంటే, దేవునిపై విశ్వాసము లేదని లోకానికి చాటిస్తున్నావు. నిన్ను చూచి ఆ వెలుగుకు ఇతరులు ఆకర్షింపబడాలి. గాని నిన్ను చూచి నీ దేవుని నామమును అన్యులు కించపరచే లాగున నీవుండకూడదు.

చింతించుటమాని ప్రార్థన చేయాలని పౌలు భక్తుడు ఫిలిప్పీ సంఘమునకు వ్రాస్తున్నాడు. పౌలు సంకెళ్లలో ఉండి ఈ మాటలు వ్రాస్తున్నాడంటే దేవునిలో ఆయనకెంత విశ్వాసమో చూడండి.

**"ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి. మీ సహనమును సకల జనులకు తెలియబడనియ్యుడి. ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును."** – ఫిలిప్పీ. 4:4–7

దేనినిగూర్చి చింతించే అవసరము లేదు. ప్రతి విషయములో కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. ప్రార్థన చేయాలి. మీ విజ్ఞాపనలు దేవునికి తెలియజేయాలి. అప్పుడు దివ్యమైన దేవుని సమాధానము మీ హృదయమునకు తలంపునకు కావలియుండి రక్షిస్తుందని అంటున్నాడు. వైద్యులు ఏమంటున్నారంటే కొన్ని రోగాలు చింతించుట ద్వారానే వస్తాయని, చింత ఎక్కువైతేనే (B.P) బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతుంది. షుగర్ ఎక్కువై పోతుంది. చింతలో టెన్షన్ పెరిగిపోయి సమాధానము కోల్పోతావు. నిద్రపట్టదు. దేవుడు నీకిచ్చిన అవయవములు పాడయి వాటియొక్క సహజ సిద్ధమైన శరీరతత్వమును (బాడీ సిస్టమ్) కోల్పోతాయి. అదుపుతప్పి సరిగ్గా పనిచేయవు. దానితో రోగగ్రస్తులవుతారు. చింతిస్తే జీర్ణ వ్యవస్థ (digestive system) పాడవుతుంది. అల్సర్ లాంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ప్రభువు పరిశుద్ధ గ్రంథములో చింతించుట మాని ప్రార్థన చేశాడు. ఆయన చింతాక్రాంతుడయ్యాడు. ప్రార్థన చేశాడు.

**"అప్పుడాయన – నా ప్రాణము మరణమగునంతగా దుఃఖములో మునిగియున్నది; మీరిక్కడ ఉండి మెలకువగా నుండుడని వారితో చెప్పి కొంతదూరము సాగిపోయి నేలమీద పడి, సాధ్యమైతే ఆ గడియ**

**తనయొద్దనుండి తొలగిపోవలెనని ప్రార్థించుచు - నాయనా తండ్రీ, నీకు సమస్తము సాధ్యము; ఈ గిన్నె నాయొద్దనుండి తొలగించుము; అయినను నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్ము అనెను."**

- మార్కు 14:34-36

చింతించుట మాని దేవునియందు విశ్వాసముంచాలి. దేవునియందు విశ్వాసముతో ఒక కొండను చూచి ఇది పెకిలింపబడి సముద్రములో పడవేయబడాలంటే అది తప్పకుండ జరుగుతుందని యేసుప్రభువు చెప్పాడు. విశ్వాసంతో సమస్యను ఆజ్ఞాపించినప్పుడు ఆ సమస్యనుండి విడుదల పొందుతాము. అందుకే ప్రియవిశ్వాసీ! చింతించుట మాని ప్రార్థించు దేవునియందు విశ్వాసముంచు. చింతాక్రాంతుడు అనే నామముతో దేవుని స్తుతించి, నీ చింతలన్నీ తీర్చమని ప్రార్థించు. Hurry, worry, curry can kill man అంటారు. కొంతమందికి ఎప్పుడూ హడావుడి, ఆతృత, తొందరపాటు. వారు నెమ్మదిగా ఉండరు. ఎప్పుడూ కోపము గందరగోళముతో ఉంటారు. ఎందుకీ హడావుడి తొందరపాటు? ఏమి సాధించడానికి? ఎవరిని ఉద్ధరించడానికి? ఈ లోకములోకి ఏమి తీసికొని వచ్చావు? ఏమి తీసుకొని వెళతావు? రిక్తహస్తాలతో వచ్చావు రిక్తహస్తాలతో వెళ్లిపోతావు. దేవునియందు ఆనందిస్తు నెమ్మదిగా ఉండు. నీ భారము ఆయనమీద వేయి. దేవుని వాగ్దానములు నమ్ము. ప్రార్ధన చేయి. యెడతెగక ఆయనయందు విశ్వాసముంచు. నీ చింతలు తీర్చడానికే సిలువలో చింతాక్రాంతుడయ్యాడు. అనే సంగతి జ్ఞాపకము చేసికో. చింతాక్రాంతుడనే నామముతో దేవుని స్తుతించి ప్రార్థించి నీలోని చింత యావత్తు తొలగించుకోవాలి. ప్రభువా, నీవు నాకొరకు చింతాక్రాంతుడవయ్యావు ఇంక దేనినిగూర్చి నేను చింతించను. ప్రతి విషయముకొరకు ప్రార్థన చేస్తాను అని తీర్మానము చేసికోవాలి.

విశ్వాసులు దేవుని నామములు ధ్యానించి శక్తి పొందాలి. వార్తా పత్రికలో చదివాను. 23 సంవత్సరాల యౌవనుడు ఉన్నత విద్యాభ్యాసముకొరకు ఊరినుండి నగరమునకు వచ్చి తన స్నేహితులతో కలసి ఉన్నాడట. కొన్ని రోజులకు అతని స్నేహితులు వారి విలువైన వస్తువులు దొంగిలింప బడ్డాయని, ఆ దొంగతనము నీవే చేశావని ఆ అబ్బాయిమీద నిందమోపారు. తానెంత చెప్పినా వారు వినిపించుకోలేదు. ఏ నేరము చేయక పోయినా స్నేహితులు తనను నమ్మడము లేదని చింతతో ఆత్మహత్య చేసికొని చనిపోయాడట. తల్లిదండ్రులకు ఈ వార్త తెలియజేస్తే వారు వచ్చి దుఃఖముతో కుమారుని మృతదేహమును వారి ఊరికి తీసుకుపోయారు. ఎన్ని ఆశలతో ఆ బిడ్డ నగరానికి వచ్చాడో గాని కొంత కాలమునకే స్నేహితులచే అవమానింపబడి అది తట్టుకోలేక చనిపోయాడు. దేవుని యొక్క నామములు ఆయన గుణాతిశయములు తెలిసియుంటే జీవము గల దేవుని యొక్క సత్యసువార్త తెలిసియుంటే ఆత్మహత్య చేసికొనేవాడు కాదు. మనకెన్ని సంభవించడము లేదు? మనము ప్రతిరోజు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాము. నిందలు, అవమానములు, చెడ్డమాటలు భరిస్తున్నాము. ప్రభువుయొక్క శక్తినిబట్టి అన్నిటిని సహిస్తున్నాము. మన చింత యావత్తు ఆయనమీద వేస్తున్నాము. ప్రతి విషయములో కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాము. ప్రార్థన విజ్ఞాపనలు చేస్తు మన భారము ఆయనకు తెలియజేస్తున్నాము. ప్రతి విశ్వాసి దేవునియందు విశ్వాసముంచి ఆయనమీద ఆధారపడటము నేర్చుకోవాలి.

## 375. నరుడు

- 1 తిమోతి 2:5

**"ఆయన, మనుష్యులందరు రక్షణపొంది సత్యమునుగూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు. దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను."**

- 1 తిమోతి. 2:4-6

'క్రీస్తుయేసను నరుడు' ఇది ఆయన నామము. ఈ నామము దేవునికి ఏలాగు వర్తిస్తుందంటే ఆయన శరీరధారిగా నరావతారిగా ఈ లోకానికి వచ్చాడు. తండ్రియైన దేవునికి ఆయన ప్రజలకు మధ్యవర్తిగా ఉండటానికి మనందరి విమోచన క్రయధనము చెల్లించడానికి ఆయన నరుడిగా లోకమునకు వచ్చాడు. నరుడిగా పుట్టి, దాసుని రూపము ధరించి తన్ను తాను రిక్తునిగా చేసుకున్నాడు. ప్రజలను వారి పాపములనుండి విడిపించడానికి తానే విమోచన క్రయధనమై పోయాడు. విడిచిపెట్టకూడని ఆ పరలోక భాగ్యమును, తండ్రి కుడి పార్శ్వమునందు కూర్చునే ఆ గొప్ప భాగ్యమును విడిచి మన రక్షణార్థము నరావతారిగా లోకమునకు వచ్చాడు. ఇది తండ్రియైన దేవుని చిత్తమైయున్నది. దేవుడు లోకమును ఎంతో ప్రేమించాడు. ఎవరూ నశించకుండునట్లు తన కుమారుడైన యేసుక్రీస్తును మనకు అనుగ్రహించాడు. యేసుక్రీస్తునందు విశ్వాసముంచువారు నశింపక నిత్యజీవమును పొందుతారు. మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము పొందడము దేవుని చిత్తము.

యేసుప్రభువు నూటికి నూరుపాళ్లు దైవత్వము కలిగినవాడు అయినను నూటికి నూరుపాళ్లు (100%) మానవుడే. నరుడిగా పుట్టాడు. మనవలె ఆయన రక్తమాంసములు కలిగియున్న మనుష్యుడిగా పుట్టి మనుష్యుల మధ్యలో సంచరించాడు. నీవనుభవించే బాధలన్నీ ఆయన తన శరీరములో అనుభవించాడు. ఒకవేళ ప్రభువు నరుడిగా ఈ లోకానికి రాకుంటే మన బాధలు ఆయనకు తెలియకపోయేవి. నీ బాధలయందు సహానుభవము గలవాడు. ఆయనకు ఆకలి దప్పులు తెలుసు. ఆయన ఆకలి గొన్నాడని వాక్యములో ఉంది. ఆయన దప్పిగొన్నాడు. దాహమునకు నీళ్లు ఇమ్మని సమరయ స్త్రీని అడిగాడు. ఆయన మనవలే అలసిపోయాడు. ఆయన తాను ప్రేమించిన లాజరు చనిపోయినప్పుడు లాజరు సమాధి దగ్గర కన్నీళ్లు విడిచాడు. ప్రజలు ఎన్ని అద్భుతములు చూసినను వారు దేవునియందు విశ్వాసముంచలేదు. వారిలోని అవిశ్వాసమును చూచి ప్రభువు ఆశ్చర్యపడ్డాడు. ఆయన మనవలె వ్యసనము, దుఃఖము అనుభవించాడు. వేదన బాధను అనుభవించాడు. ఆయనను కొరడాలతో కొట్టినప్పుడు, ముళ్లకిరీటము తలపై గ్రుచ్చినప్పుడు రక్తము ఊటలుగా ప్రవహించింది. ఆయన రోగులను చూచినప్పుడు కనికరముతో కదలింపబడ్డాడు. ఇవన్నీ మానవ లక్షణాలు వీటిని యేసుప్రభువులో చూస్తాము. ఎందుకంటే ఆయన 100% నరుడిగా పుట్టాడు.

ఒకరోజు శిష్యులు దోనెలో ప్రయాణమై వెళుతుంటే మార్గమధ్యలో పెద్ద తుపాను ఎదురయింది. యేసుప్రభువు ఆ దోనెలో లేడు. కొంత సేపైన తరువాత ప్రభువు అలలమీద నడచి వస్తుండగా శిష్యులు చూచి భూతమనుకొని భయపడతారు. అప్పుడు యేసుప్రభువు భయపడకుడి; నేనే, ధైర్యము తెచ్చుకొనుడని అంటాడు.

ప్రభువు మానవుడిగా ఈ లోకానికి వచ్చి మానవుడనుభవించే బాధలన్నికూడ అనుభవించాడు.సిలువ మరణము తరువాత మూడవరోజున ప్రభువు పునరుత్థానుడయ్యాడు. ఆయన తాను పునరుత్థానుడనయ్యానని తన్ను తాను ప్రజలకు ప్రత్యక్ష పరచుకున్నాడు. శిష్యులకు ప్రత్యక్షమయ్యాడు. తలుపులు మూసి ఉన్న గదిలోకి ప్రభువు రాగానే శిష్యులు భూతమని భయపడతారు. ప్రభువు వారికి భయపడవద్దని చెప్పి తన గాయపు గురుతులను చూపిస్తాడు. ప్రభువు పునరుత్థానుడైన తరువాత మహిమ శరీరముతో ఉంటాడు గనుక తలుపులు మూసిఉన్నా లోనికి ప్రవేశించాడు. శిష్యులతో మీరు భయపడకుడి మీకు సమాధానమని పలుకుతున్నాడు.

**"వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను నిలిచి - మీకు సమాధానమవుగాకని వారితో అనెను. అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి. అప్పుడాయన - మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నా కున్నట్టుగా మీరు చూచుచున్న**

**యెముకలును మాంసమును భూతమున కుండవని చెప్పి తన చేతులను పాదములను వారికి చూపెను. అయితే వారు సంతోషముచేత ఇంకను నమ్మక ఆశ్చర్యపడుచుండగా ఆయన – ఇక్కడ మీయొద్ద ఏమైన ఆహారము కలదా అని వారినడిగెను. వారు కాల్చిన చేప ముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసికొని వారియెదుట భుజించెను."** – లూకా 24:36-42

ఆయన తాను నరుడనని తన్ను తాను బుజువు పరచుకుంటున్నాడు. మీరు కలిగియున్నట్లే నాకు మాంసము, ఎముకలు ఉన్నాయని అంటున్నాడు. వారు ఆశ్చర్యచకితులై ప్రభువు సిలువలో మరణించాడు కదా నిజముగా సజీవుడయ్యాడా? లేక భూతమా?అని సందేహపడు తుంటారు. వారి సందేహము తీర్చడానికి మరియొక బుజువు చూపుతున్నాడు. నాకు ఆకలి అవుతుంది. మీదగ్గర తినడానికి ఏమైనా ఆహారము ఉన్నదా? అని అడుగుతాడు. వారు కాల్చిన చేప ముక్కను అందిస్తే వారి ముందు భుజించాడు.

యేసుక్రీస్తు సర్వమానవాళి రక్షణార్థము, పాపపరిహారార్ధము నూటికి నూరుపాళ్లు దైవత్వము కలిగినవాడు నూటికి నూరుపాళ్లు నరుడిగా ఈ లోకానికి వచ్చాడని తన్ను తాను బుజువు పరచుకున్నాడు. అందుకే ప్రార్థన చేసినప్పుడు మన బాధలన్నీ ఆయన అర్థము చేసికుంటాడు. హల్లెలూయ! నీ బాధలలో ఆయన సహానుభవము గలవాడు. గనుక ప్రార్థన చేయగానే విడుదల లభిస్తుంది.

**"మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము."** – హెబ్రీ. 4:15,16

**'నరుడు'** అని ఆయన నామముతో స్తుతించి ప్రార్థించినప్పుడు దేవా, నీవు నరవతారిగా నేను పడే బాధలన్నీ నీ శరీరముతో అనుభవించావు. నా ప్రతివిధమైన బాధ నీకు తెలుసు. నా బాధలలో నాతో సహానుభవము కలిగినవాడవు. నన్నీ బాధనుండి విడిపించుమని ప్రార్థించినప్పుడు వెంటనే విడుదల పొందుతావు. కావున ధైర్యముగా దేవుని కృపాసనముయొద్దకు చేరి దేవునికి మొఱ్ఱపెట్టాలి. విడుదల పొందాలి.

## 376. అభిషేకించినవాడు – 2 కొరింథీ. 1:21

**"మీతో కూడ క్రీస్తునందు నిలిచియుండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే."** – 2 కొరింథీ. 1:21

**'అభిషేకించినవాడు'** అనే నామము ఈ వాక్య భాగమునుండి తీసికుంటున్నాము. పౌలు భక్తుడు కొరింథీ సంఘమునకు లేఖ వ్రాస్తూ క్రీస్తునందు మేము నిలిచియుండునట్లుగా మమ్మును అభిషేకించినవాడు దేవుడే అంటున్నాడు. దేవునిచేత అభిషేకింపబడాలి అని అందరికి ఇష్టము. దేవుని అభిషేకము పొందుటకు ప్రార్థించమని అడుగుతారు. అన్యకుటుంబమునుండి క్రొత్తగా రక్షింపబడిన సహోదరుడు నా దగ్గరకు వచ్చి అమ్మా, నేను పరిశుద్ధాత్మ అభిషేకము పొందునట్లు నాకొరకు ప్రార్థన చేయండి అన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. వాక్యము సరిగ్గా అర్థము కావాలంటే నాకు దేవుని అభిషేకం అవసరమని సమాధానమిచ్చాడు. నిజమే దేవుని వాక్యము అర్థము కావాలన్నా, దేవుని వాక్యములో ఇమిడియున్న మర్మములు గ్రహించాలన్నా అభిషేకము ఎంతో అవసరము. పరిశుద్ధాత్ముడే మనకు బోధకుడైనప్పుడు సమస్తము గ్రహించగలము.

క్రొత్తగా రక్షింపబడిన సహోదరుడు ఎంతగానో దేవునిలో ఎదిగి పోయాడు. కొన్ని నెలల క్రిందటే బాప్తిస్మం పొందాడు. పరిశుద్ధ గ్రంథమును తరచి చూస్తున్నాడు. వాక్యమును ఆసక్తిగా వింటున్నాడు, చదువుతున్నాడు. పరిశుద్ధాత్మకొరకు తృష్ణగొనియున్నాడు. దుప్పి నీటివాగుల కొరకు ఆశపడినట్లు దేవా, నా ప్రాణము నీకొరకు తృష్ణగొనియున్నదని కీర్తనకారుడు సెలవిచ్చిన రీతిగా ఈ సహోదరుడు దేవునికొరకు తృష్ణగొనియున్నాడు. ఎంత ఆశ్చర్యము!

మనలో దేవుని అభిషేకముంటేనే దేవునిమాటలు గుర్తించగలము. దేవుని స్వరము వినగలము. దేవునికొరకు ఘనమైన కార్యములు చేయగలము. దేవుని అభిషేకము మనలో నిలిచియుంటేనే శ్రమలలో నిటారుగా నిలబడగలము. ఎన్ని ఆటంకములు ఎదురైనా విశ్వాసముతో ధైర్యముగా వాటిని అధిగమిస్తు ముందుకు సాగిపోతాము. నీలో ఉన్న దేవుని అభిషేకము నీ కాడిని విరుగగొడుతుంది. అందుకే ప్రతి విశ్వాసి 'అభిషేకము' కావాలని ప్రార్థించాలి పొందాలి. ప్రార్థనలో అసలైనవి అడగకుండ ఏవేవో అడుగుతారు. విశ్వాసులకు గాక కేవలము దేవుని సేవకులకే అభిషేకము అవసరమని కొందరనుకుంటారు. దేవుని సేవకులకు తప్పకుండ దేవుని అభిషేకము కావాలి. దేవుడు వారిని సేవకు పిలిచినప్పుడే తన ఆత్మతో నింపి వారికి ప్రత్యేకమైన అభిషేకమును అనుగ్రహిస్తాడు. దేవుని అభిషేకము లేకుంటే దేవుని సేవకులు సేవ చేయలేరు. కాని విశ్వాసులకుకూడ దేవుని అభిషేకము ఎంతో అవసరము. వారు తమ అనుదినజీవితములో ఎదురయ్యే సమస్యలు, శ్రమలు ఎదుర్కొని దేవుని శక్తితో ముందుకు సాగిపోవడానికి అభిషేకము కావాలి. ప్రార్థన చేస్తే దేవుడు నిన్ను తప్పకుండ తన ఆత్మతో అభిషేకిస్తాడు.

యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత శిష్యులకు ప్రత్యక్షమై వారికి సమాధానమని చెప్పి, వారి మీద ఊది – పరిశుద్ధాత్మను పొందుమంటాడు. పరిశుద్ధాత్మ పొందునప్పుడు మీరు శక్తి పొంది యూదయ సమరయ భూదిగంతముల వరకు నాకు సాక్షులైయుంటారని శిష్యులతో సెలవిస్తాడు. అభిషేకముంటేనే మీరు దేవునికొరకు సాక్షిగా నిలబడతారు. శ్రమలలో ఆనందిస్తారు. శ్రమలకు భయపడి సమస్యలను విడిచి పారిపోరు కాని ప్రార్థన చేసి దేవుని సహాయముతో సమస్యలను జయిస్తారు. ప్రతి సమస్యను అభిషిక్తులు ఒక సవాల్‌గా ఎదుర్కొంటారు. అందుకే అభిషేకము అడిగి పొందాలి. దేవుని సేవకులకే కాదు ప్రతి విశ్వాసికికూడ దేవుడు తన అభిషేకం అనుగ్రహిస్తాడు. విశ్వసించిన ప్రతివాడు పొందుతాడు. దేవునికి స్తోత్రం! హల్లెలూయ!!

**"అయితే మీరు పరిశుద్ధునివలన అభిషేకము పొందినవారు గనుక సమస్తమును ఎరుగుదురు."** – 1 యోహాను 2:20

**"అయితే ఆయనవలన మీరు పొందిన అభిషేకము మీలో నిలుచుచున్నది గనుక ఎవడును మీకు బోధింపనక్కరలేదు; ఆయన ఇచ్చిన అభిషేకము సత్యమే గాని అబద్ధము కాదు; అది అన్నిటినిగూర్చి మీకు బోధించుచున్న ప్రకారముగాను; ఆయన మీకు బోధించిన ప్రకారముగాను, ఆయనలో మీరు నిలుచుచున్నారు."** – 1 యోహాను 2:27

అంటే అన్నిటిని వివేచించడానికి, జ్ఞానయుక్తముగా ఆలోచించడానికి, ఎవరూ మిమ్మును మోసగించకుండ మీలోనున్న అభిషేకము మిమ్మును సర్వసత్యములోకి నడిపిస్తుందని యోహాను భక్తుడంటున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా మీరు దైవాభిషేకం పొందుతారు. నీలో నిలిచియున్న ఈ అభిషేకమే నీ కుటుంబమును, నీ సంఘమును దైవ చిత్తానుసారముగా ముందుకు నడిపించడానికి నీకు సహాయపడుతుంది. ఈ అభిషేకము నీకు నిత్యమైన ఉపదేశమిస్తుంది. నీకు జ్ఞాన వివేకములు కలిగిన ఆత్మను అనుగ్రహించి మర్మములు బయలుపరుస్తుంది. దేవునికొరకు బలమైన, శక్తివంతమైన కార్యములు చేయడానికి ధైర్యము పొందుతావు. అభిషేకింపబడిన వారు పిరికివారు కాదు. అభిషేకింపబడిన వారు ఏ కార్యమైనా ధైర్యముతో చేస్తారు.

**"దేవుడు మనకు శక్తియు ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమునుగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మ నియ్యలేదు."** – 2 తిమోతి 1:7

అభిషేకింపబడినవారి హృదయములో ప్రేమ నిండుగా ఉంటుంది. ఎట్టి ద్రోహకార్యములు చేసినవారినైన క్షమించి ప్రేమించే శక్తి పొందుతారు. యేసుప్రభువు సిలువలో అదే మాదిరి చూపాడు. తనను హింసించి, నిందించి

దూషించి సిలువకు అప్పగించినవారినికూడ క్షమించుమని ప్రార్థించాడు. తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు. వీరిని క్షమించుమని ప్రార్థిస్తాడు. స్తెఫను భక్తుడు రాళ్లతో రువ్వబడినప్పుడు శరీరమంతా గాయములు, రక్తము స్రవిస్తున్నను మోకాళ్లమీద ఉండి ప్రభువా, వారిమీద ఈ పాపము మోపకుమని ప్రార్థించాడు. ఎంత ప్రేమో చూశారా, తనను రాళ్లు రువ్వి గాయపరచేవారికొరకు ప్రార్థిస్తున్నాడు.

కొన్నిసార్లు కుటుంబములో సమస్యలు తట్టుకోలేక నీరసించి క్రుంగిపోయి బలహీనులమైపోతాము. కాని మనలో ఉన్న దేవుని అభిషేకము మనలను ఆదరించి దేవుని వాగ్దానములు జ్ఞాపకమునకు తెచ్చి క్రుంగిన స్థితినుండి లేవనెత్తుతుంది. బలహీనముగా ఉన్న నిన్ను తిరిగి దేవుని శక్తితో నింపి బలపరుస్తుంది. అందుకే పౌలు భక్తుడు – నన్ను బలపరచువాని యందే నేను సమస్తమును చేయగలనంటున్నాడు. ప్రతి ఒక్కరికి అభిషేకము ఎంతో అవసరము. ప్రార్థనద్వారా, విశ్వాసముద్వారా ఉపవాస ప్రార్థనద్వారా దేవుని అడిగిపొందాలి. తనను అడుగువారికి నిశ్చయముగా కొలతలేని పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తానని దేవుడు వాగ్దానము చేశాడు.

చాలా మందికి సేవ ఉంటుంది కాని నడిపించేవారికి దేవుని అభిషేకముండదు. అభిషేకము లేకుంటే సేవాజీవితంలో ఓడిపోతాము. సమస్యలు, శ్రమలు వచ్చినప్పుడు తట్టుకొనే శక్తి ఉండదు. గొప్ప కార్యములు చేయడానికి ధైర్యము చాలదు. ఎవరికైనా తమ గుప్పిలి విప్పి సహాయము చేయడానికికూడ ఆలోచిస్తారు. ఉన్నది ఇచ్చేస్తే ఎలాగు అంటూ వెనుకడుగు వేస్తారు. దేవునికి నిండు మనస్సుతో ధారాళముగా ఇవ్వడానికికూడ అభిషేకముండాలి. అభిషేకముంటే అన్నీ దేవుడే చూచుకుంటాడనే విశ్వాసముతో ముందుకు సాగిపోగలం. చాలా మందికి పేరు ప్రక్కన ఎన్నో డిగ్రీలుంటాయి. గాని వారు ప్రార్థిస్తే ఒక్క రోగికూడా స్వస్థత పొందదు. ఒక్క అద్భుతకార్యము జరుగదు. సేవ చేయడానికి అర్హత దేవుని అభిషేకమే. నిన్ను ఈ రక్షణ భాగ్యము పొందడానికి పిలిచిన దేవుడే నిన్ను అభిషేకించి వాక్యములో స్థిరపరుస్తాడు.

పరిశుద్ధ గ్రంథములో చూస్తే పాత నిబంధనలో, క్రొత్త నిబంధనలో భక్తులు దేవునిచేత అభిషేకింపబడి బలము కలిగి దేవునికొరకు గొప్ప కార్యము చేయగలిగారు. సమ్సోను ఎంతటి అభిషేకము గలవాడంటే శత్రువులైన ఫిలిష్తీయుల (చేలను) పంటపొలాలను నాశనముచేయడానికి మూడు వందల నక్కలను పట్టుకొని తోకతట్టు తోకనుత్రిప్పి కట్టి ఆ రెండు తోకల మధ్యలో దివిటీలను పెట్టి, ఆ దివిటీలను అంటించగానే ఆ వేడికి తాళలేక నక్కలు ఒకొక్కదిక్కుకు పరుగెత్తి ఫిలిష్తీయుల ద్రాక్షతోటలను, అంజూరపు తోటలను, గోధుమ పంటలనంతా తగులబెట్టి నాశనము చేశాయి. నక్క యుక్తి కలిగిన జంతువు. అలాంటి నక్కను ఒకటి పట్టుకోవాలంటేనే కష్టము కాని సమ్సోను 300 నక్కలను పట్టుకున్నాడు. అభిషేకము లేకుంటే ఒక కోడిపిల్లను పట్టుకోవడానికే ఎంతో కష్టపడతాము. దేవుడు సమ్సోనుకు గొప్ప జ్ఞానము ఇచ్చాడు. మనుష్యులను పంపితే శత్రువులు చంపివేస్తారు. అదే జంతువులైతే ఏమీ చేయలేరని నక్కలను పంపి వారి పంటలను పూర్తిగా నాశనము చేశాడు. అభిషేకముంటే గొప్ప జ్ఞానముంటుంది. అందుకే సేవాజీవితములో కాని కుటుంబ జీవితములో గాని విజయవంతముగా ముందుకు కొనసాగాలంటే మనలో అభిషేకముండాలి.

అందుకే పౌలు భక్తుడు – మేము మీతోకూడ క్రీస్తునందు నిలిచియుండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే అంటున్నాడు. మేము మీకెంత దేవుని వాక్యము బోధించినను మీరు అవిధేయులుగా, తిరుగబడేవారుగా ఉన్నారు. అయినను దేవుని ప్రేమతో మిమ్మును ప్రేమించడానికి, సహించడానికి, ఆదరించడానికి మీరు తప్పుచేస్తే మిమ్మును ఖండించి, బుద్ధిచెప్పి సరియైన మార్గములో నడిపించడానికి మమ్మును అభిషేకించినవాడు దేవుడే అంటున్నాడు. మీతోకూడ శ్రమ అనుభవించడానికి మాకు అభిషేకము ఎంతో అవసరము. అభిషేకము నిలపలేమని అంటున్నాడు. ఇట్టి అభిషేకమును ప్రార్థించి పొందాలి.

**'అభిషేకించినవాడు'** అను నామముతో దేవుని స్తుతించి, ప్రభువా, నన్ను అభిషేకించు; నా కుటుంబములో నేను అభిషేకింపబడినవాడిగా, అభిషేకింపబడినదానిగా ఉండాలి అని ప్రార్థించాలి. అభిషేకము కాడిని విరుగగొడుతుంది. అభిషేకముంటే జ్ఞానము, బలము, శక్తి, ప్రేమతో నింపబడతారు. అభిషేకముంటేనే గొప్ప కార్యములు చేయడానికి వీలవుతుంది. కనుక ప్రార్థన చేసి ప్రతి విశ్వాసి దేవుని అభిషేకము పొందాలి.

నేను సేవ ఆరంభించినప్పుడు నాకు ఎలాంటి తలాంతులు లేవు. కేవలము దేవుని పిలుపు, దర్శనము కలిగియున్నాను. ఆయన పిలుపుకు లోబడి సేవ ఆరంభించాను. కాని ప్రసంగము చేయడమురాదు. పాటలు రావు. దాదాపు 3 సంవత్సరములు ప్రసంగీకులను, పాటలు పాడేవారిని, వాయిద్యాలు వాయించే బృందాన్ని, స్వస్థత ప్రార్థనలు చేసేవారిని పిలిపించేదానను. ఈ విధముగా చేసి అలసిపోయాను. ఇంక లాభములేదని బ్యాంక్ ఉద్యోగమునకు 50 రోజులుసెలవుపెట్టి ప్రభువు సన్నిధిలో పూర్తికాల ఉపవాస ప్రార్థనలో కూర్చున్నాను. ప్రభువా, నీవు నన్ను నీ సేవకు పిలిస్తే, నన్ను నీ ఆత్మతో అభిషేకించు. ఆత్మవరములతో నింపు. నీవు నన్ను నీ ఆత్మతో అభిషేకించేవరకు నీ పాదములు విడువనని పట్టుదలతో ప్రార్థించాను. దేవుడు నన్ను ఎంతగా అభిషేకించాడంటే నా గిన్నె నిండి పొర్లి పారుతుంది. ఎన్ని గంటలైనా ప్రసంగించడానికి దేవుడు తన వాక్యమును ధారళముగా నాకనుగ్రహించాడు. నా కడుపులోనుండి జీవజలధారలు ఉబికి ప్రవహిస్తున్నాయి. పాటలు పాడితే అమ్మా, మీ గొంతు చాలా మధురముగా ఉంది. మీ స్వరము చాలా బాగుందని ప్రశంసిస్తారు. ప్రార్థన చేస్తే స్వస్థత కార్యములు అద్భుత కార్యములు, ఎన్నో జరుగుతున్నాయి. దేవుడు ఫలములతో, వరములతో నన్ను నింపి అనేకులకు ఆశీర్వాదకరముగా దేవునికి మహిమకరముగా వాడుకుంటున్నాడు. దేవునికి స్తోత్రము! హల్లెలూయ!! దేవుని నామమునకే మహిమ కలుగునుగాక. దేవుడు తనను అడుగు ప్రతి వానికి నిశ్చయముగా కొలతలేని పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడు. ❀


## UPF Bank Account Details

### Union Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **133911100000946** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **UBIN0813397** |

### State Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **67088374386** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **SBIN0012917** |

**చెక్కులు :** United Peoples Fellowship
**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**
**(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)**
**Phone Pe / G Pay : 7901236907**
**POS : Card Swipe**

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 172. "నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని."

- యోహాను 10:11

**"నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును."** - యోహాను 10:11. ఇది యేసుప్రభువు స్వయముగా తన నోటిద్వారా పలికిన గొప్పమాట. నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని అనేది వాగ్దానము. గొప్ప కాపరి, ప్రధాన కాపరి, గొఱ్ఱెల కాపరి, ఇశ్రాయేలీయుల కాపరి, ఆత్మల కాపరి, అధ్యక్షుడు, మంద కాపరులకు సహకారి అనునవి దేవుని పేర్లు. యేసుక్రీస్తు మంచి కాపరి, సాతానుడు కాపరి కాదు; వాడు దొంగ దోచుకొనువాడు; వాడు గొఱ్ఱెలకు హత్య, నాశనము, పాడు, కీడు తలపెడతాడు. కాని మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెడతాడు. యోహాను సువార్త 10వ అధ్యాయము చదివి అర్థము చేసికొంటే శక్తితో నింపబడతారు. **"జీతగాడు గొఱ్ఱెల కాపరికాడు గనుక గొఱ్ఱెలు తనవికానందున తోడేలు వచ్చుట చూచి గొఱ్ఱెలను విడిచిపెట్టి పారిపోవును, తోడేలు ఆ గొఱ్ఱెలను పట్టి చెదరగొట్టును. జీతగాడు జీతగాడే గనుక గొఱ్ఱెలనుగూర్చి లక్ష్యము చేయక పారిపోవును. నేను గొఱ్ఱెల మంచి కాపరిని."** - యోహాను 10:12-14

ఈరోజు నీవు కలత, కలవరము, విచారముతో ఉంటే నీవు గొఱ్ఱెవు, ఆయన మంచి కాపరి అనే సంగతి జ్ఞాపకము చేసికో. గొఱ్ఱెకు రోగము కలిగితే కాపరి దృష్టి అంతా ఆ బాగోలేని గొఱ్ఱెమీదే ఉంటుంది. బాగోలేని గొఱ్ఱెను కాపరి భుజముమీద ఎత్తికొని వెళ్తాడు. మందలో బలహీనమైన గొఱ్ఱెలను భద్రముగా తోలుకొని వెళ్తాడు. ఎంతో నెమ్మది, ఓర్పుతో వ్యవహరిస్తాడు; చిన్న గొఱ్ఱెపిల్లలను ముద్దాడుతాడు; గొఱ్ఱెపిల్లలు కాపరి మీదకు ఎక్కుతాయి. కాపరి గొఱ్ఱెలదొడ్డి ద్వారము దగ్గర కూర్చొని కొట్టములోనికి వెళ్లే ఒక్కోగొఱ్ఱెను తన హస్తముతో నిమిరి వాటికి అంటుకొనిన మట్టి, మురికి తొలగించి శుభ్రము చేస్తాడు. కాపరి గొఱ్ఱెలన్నిటిని పచ్చికబయళ్లయొద్దకు తోలుకొని పోయి ఆకలి తీరుస్తారు, జలములయొద్దకు నడిపి దాహము తీరుస్తారు. కాపరి తోడుంటే గొఱ్ఱెలకు భయమే ఉండదు. గొఱ్ఱెలన్నీ మందగా పోయే దృశ్యం భలేగుంటుంది. నేను ఆ దృశ్యం చూసి ఎంతో ఆనందిస్తాను. కాపరి చేతిలో దుడ్డు కఱ్ఱ, దండము ఉంటుంది. మందలో ఉన్న గొఱ్ఱెలు రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాలకు, పెద్ద శబ్దాలకు మరిదేనికి భయపడవు. అవి ఒకే లక్ష్యాన్ని కలిగి ఉంటాయి. కాపరి స్వరమే వింటాయి. ప్రభువు నా గొఱ్ఱెలు నా స్వరము వినునన్నాడు. కావున సింహము వచ్చినా, తోడేలు వచ్చినా భయపడవు. ఎందుకంటే మంచి కాపరి తోడేలు వచ్చినప్పుడు తన గొఱ్ఱెలను ఒంటరిగా విడిచి వెళ్లడు. జీతగాడైతే - అమ్మో నా ప్రాణం నేను దక్కించుకొంటాను, గొఱ్ఱెలకు ఏమైతే నాకేంటి అంటాడు. అందుకే - యేసుప్రభువు, జీతగాడు కాపరికాడు, నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని, కాపరి గొఱ్ఱెలకొరకు ప్రాణము పెట్టును అంటాడు.

కావున నీవు ప్రతిరోజు యేసు రక్తమును కొనియాడి జీవితములో శక్తి పొందాలి. నేను ప్రతిరోజు ఉదయం ఆలాగు చేస్తాను. నాకొరకు ప్రాణము పెట్టిన నా కాపరిని నేను జ్ఞాపకము చేసికొంటాను. నాకొరకు ప్రాణము పెట్టిన కాపరి ఉండగా నాకెందుకు భయం. ఈలాగు ధ్యానించినప్పుడు నాకు ఎంతో ధైర్యము కలుగుతుంది. నేను గాఢాంధకారపులోయలో సంచరించినను ఏ అపాయమునకు భయపడను. ఆయన దుడ్డు కఱ్ఱ, దండము నన్ను ఆదరిస్తుంది. ఆయన తన నీతిమార్గాల్లో నన్ను నడిపిస్తాడు. నా గిన్నె నిండి పొర్లుతుంది, నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వస్తాయని కీర్తనకారుడైన దావీదు అంటాడు. 23వ కీర్తన ధ్యానము చేసికొంటే మన గుండెలో భయం, భూకంపము కలుగదు. శత్రువులకు భయపడము. ఆయన శత్రువుల యెదుట మనకు భోజన బల్ల సిద్ధపరుస్తాడు. దావీదు గొఱ్ఱెల కాపరిగా ఉన్నప్పుడు గొఱ్ఱెలను మ్రింగివేయుటకు వచ్చిన సింహాన్ని, తోడేలును ఎదుర్కొని చీల్చి వేశాడు. తన గొఱ్ఱెలన్నిటిని రక్షించాడు. మనము కాపరిలేని గొఱ్ఱెలముకాము మనకు కాపరి ఉన్నాడు. ఆయన నీ మీద దృష్టియుంచి నిన్ను పోషిస్తున్నాడు, ఏ కొదువ రానీయడు. **"యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు."** - కీర్తనలు 23:1

పురుషులు తమ భార్యను పరిచయము చేస్తున్నప్పుడు ఈమె నా భార్య అని చెబుతారు. నాకు చెందినది అని గర్వంగా చెబుతారు. ఆలాగు యెహోవా నా కాపరి అని దావీదు తనకు దేవునికి ఉన్న సంబంధమునుగూర్చి చెబుతున్నాడు. ఆయన సమస్తము అనుగ్రహిస్తాడు. ఆకలి దాహం తీరుస్తాడు, నీ ప్రాణమును సేదదీరుస్తాడు. నీ జీవితంలో గందరగోళం సంభవించినప్పుడు నిన్ను ఆదరిస్తాడు. గాఢాంధకారలోయ అనుభవము కలిగినా నీకు ఏ భయము ఉండదు నీకు ఏ అపాయము రాదు. నీవు దిక్కులేనివానివి కాదు. నీకు కాపరి ఉన్నాడు. నీవు దారితప్పినప్పుడు శిక్షాదండన చేసి నిన్ను సరియైన మార్గంలో నడిపిస్తాడు. దుడ్డుకఱ్ఱతో కొమ్మలను వంచి నీ ఆకలి తీరుస్తాడు. నీకు అర్థముకాని విషయములను, మర్మములను పరమందున్నవాడు అర్థము చేస్తాడు. నూనెతో నీ తలను అంటుతాడు. తల అదిరినప్పుడు తలనొప్పి కలిగినప్పుడు పెద్దలు - తలకు నూనె అంటుకో, తలకు నూనె తక్కువ చేయొద్దంటారు. దినదినము క్రొత్త సవాళ్లను ఎదుర్కొనుటకు దేవుడు క్రొత్త తైలముతో నిన్ను అంటుతాడు. నీ గిన్నె నిండి పొర్లాలి. ప్రభువులో నీ సంతోషం, ఆనందం నిండి ఇతరులకు అందేరీతిగా దేవుడు నిన్ను దీవిస్తాడు. నీవు బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములు నీ వెంట వస్తాయి. అన్యజనులకు నిద్ర పట్టదు. వారి బ్రతుకు దినాల్లో పోలీసువాళ్లు, అప్పులవాళ్లు, శత్రువులు వారి వెంట వస్తారు. కాని ప్రభువును అనుసరించువారిని కృప వెంబడి క్షేమం వెంబడిస్తాయి. చిరకాలము నీవు దేవునితో జీవిస్తావు; నిత్యత్వములోకి దాటుకొంటావు. ఈలోకంలో దేవుడే నీకు శరణ్యము. పరలోకంలో ఆయనతోనే నిత్యనివాసము నీకు స్థిరపరచబడింది. ఆయనే గొఱ్ఱెలకు మంచి కాపరి.

## 173. "ఒకడు దేవుని ప్రేమించినయెడల అతడు దేవునికి ఎరుకైనవాడే."

- 1 కొరింథీ 8:3

ఇందులో వాగ్దానము ఉంది, షరతూ ఉంది. దేవునికి ఎరుకైనవానిగా ఉండాలంటే నీవు దేవుని ప్రేమించాలి. నీవు ఎల్లవేళల దేవుని కార్యాలను దైవ సేవను ప్రేమించి నిష్ఠ కలిగి ఆయనను ఆరాధిస్తే నీవు దేవునికి ఎరుకైనవానిగా ఉంటావు. అందరికి దేవుడు తెలుసు గాని దేవుడు నిన్ను ఎరిగియుండుట గొప్ప విషయం. మీరు యునైటెడ్ స్టేట్స్‌కు ఎగిరి వెళ్లి అక్కడ దిగినప్పుడు అక్కడి ప్రెసిడెంట్‌ను గుర్తుపడతారు. అవునా? కాదా? కాని. అమెరికా ప్రెసిడెంట్ దృష్టి నీ మీదకు వచ్చిందంటే నీ సంతోషానికి అవధులు ఉంటాయా? దేశ ప్రధాని నిన్ను గుర్తించి నీ దగ్గరకు వచ్చి మాట్లాడాడంటే నీవు కాలర్ ఎత్తుతావు; నిన్ను చూసినవారికి నీ గురించి భయము కలుగుతుంది. ఎందుకంటే నీవు ప్రాముఖ్యమైన వ్యక్తితో సంబంధము కలిగియున్నావు. నీవు వెళ్తున్న మార్గంలో పెద్ద పెద్ద వారితో నీకు గుర్తింపు కలిగినప్పుడు నీకు చాలా ఘనత దొరుకుతుంది.

నీవు దేవుని ప్రేమిస్తే నీకు దేవునివలన గుర్తింపు కలుగుతుంది. దేవుని దృష్టి నీపై ఉంటుంది. నీవు చేసే పనులను, నీ తలంపులు, నీ మార్గములు,

నీ క్రియలను ఆయన చూస్తాడు. నీ కార్యాలన్నీ ఆయనకు అనుకూలంగా ఉంటాయి. ఇది ఎంతో గొప్ప భాగ్యము. నీవు ఈ రోజు ఏ పరిస్థితిలో ఉన్నా, నీవు దేవుని ప్రేమించే వ్యక్తివైతే అది దేవుని సెలవు లేకుండా రాలేదని గ్రహించాలి. ఏ రోగమైనా, బాధయైనా, ఇరుకైనా, ఇబ్బందియైనా, క్లిష్ట సమస్యయైనా నీవు దేవుని ఎరుకలో ఉన్నావు కావున భయపడవద్దు. దేవుని సెలవు లేకుండా మీ తలవెంట్రుకల్లో ఒక్కటైనా నేలకు రాలదని ప్రభువు చెప్పాడు.

కొందరు కొన్నిసార్లు తెలివి, జ్ఞానములేక తిప్పలు పడతారు అవన్నీ దేవునికి అవిధేయత చూపడమువలన కలిగిన కార్యాలే కాని దేవుడు కావలసికొని ఇబ్బంది కలుగజేయడు. అయినను నీ స్వబుద్ధిచేత చేసే కార్యాల్లో సహితము నీకు ఆ శ్రమలద్వారా నీతి పాఠములు నేర్పి చక్కని మార్గాల్లో తిరిగి నడిపిస్తాడు. కాపరి ప్రతి గొఱ్ఱెను గుర్తిస్తాడు. మనకు మందలోని గొఱ్ఱెలన్నీ ఒకేలా కనబడతాయి; వాటి ముక్కు, కళ్ళు, రంగు, కొమ్ములు ఒకేలా అనిపిస్తాయి. కాని కాపరి ఒక్కో గొఱ్ఱెను గుర్తిస్తాడు. ఆలాగు దేవుడు ఒక్కొక్కరిని ఎరుగుతాడు, ఒక్కొక్కరిని పేరుపెట్టి పిలుస్తాడు.

ఒక సంఘ కాపరిగా నా గొఱ్ఱెలను నేను ఎరిగియుంటాను. గొఱ్ఱెలు కాపరివద్దకు రావాలి, కాపరిని పరిచయం చేసికోవాలి. కాపరి హస్తము మీ తలమీద పెడితే అది ఆశీర్వాదము. ఒకడు దేవుని ప్రేమిస్తే వాడు దేవునికి ఎరుకైనవాడు. నీవు ఎన్నో రోజులనుండి దేవునికి దూరంగా ఉన్నావు. దేవుని స్వరము వినక పాపములో, నాశనంలో, మురికి ఊబిలో ఉన్నావు. యేసుప్రభువు నిన్ను తన రక్తముతో కడిగి మందలో చేర్చాడు. నీ సొత్తుగా చేసికొన్నాడు. సాధారణముగా మానవుని మనస్సు తన సొత్తు (ధనము, సంపద) మీదే ఉంటుంది. బయటకు వెళ్లునప్పుడు తాళము సరిగ్గా వేశామా లేదా అని అనుమానపడిపోతుంటారు. సరిగ్గా తాళము వేయకపోతే ఎవరైనా ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను ఎత్తికొనిపోతారని ఆలోచిస్తుంటారు. హడావుడిలో మనము కొన్నిసార్లు సతమతమై పోతుంటాము. కాని మనము దేవునికి ఎరుకైన వారము గనుక ఆయన మనలను భద్రముగా కాపాడుతాడు. మనము విలువపెట్టి కొనబడినవారము, ఆయన తన రక్తమిచ్చి మనలను కొన్నాడు. మనము ఆయనకు ఎరుకైనవారిమి. ఆయన మనలను కాపాడుతాడు, పోషిస్తాడు, చేయిపట్టుకొని నడక నేర్పిస్తాడు కనుక నీవు దేనికీ భయపడకూడదు.

అనేకమార్లు జనాలు దేవునిపై విసుక్కుంటారు; దేవునికి విరోధముగా మాట్లాడుతారు. దేవున్నే శపించేవారు తయారౌతున్నారు. కాని – నీకు దేవుడు అన్యాయస్థుడు కాదనే జ్ఞానము ఉండాలి పరిశుద్ధుల ప్రార్థనలన్నీ ఆయన సన్నిధిలో ధూపార్థముగా, జ్ఞాపకార్థముగా నిలిచి ఉంటాయి. కావున నీవు – నేను ఇరవై సంవత్సరాలు, ముప్పై సంవత్సరాలుగా ఫలానా అంశముకొరకు ప్రార్థించాలని యేసుప్రభువు చెప్పాడు. నీ కన్నీళ్లను నా బుడ్డిలో దాచి ఉంచాను; అవి ఆయన కవిలెలో కనబడుతాయి అని దేవుడు అంటున్నాడు; ఆయన నీ కన్నీటి బొట్ల లెక్కకూడా వ్రాసి ఉంచుతాడు. ఎందుకంటే నీవు దేవుని ప్రేమించావు గనుక నీవు దేవునికి ఎరుకైనవాడివి. కొందరు – మేము ఆలయానికి వెళ్తున్నాము గాని కాపరి మమ్మును చూడలేదు అంటారు. ఒక సహోదరి నా దగ్గరకు వచ్చి – మీరు ప్రసంగం చేసేటప్పుడు నన్ను చూడనేలేదు అంది. నేను ప్రసంగం చేయాలా? ఆమెను చూస్తూ ఉండాలా? అంటే కాపరి ఆమెను చూడాలని ఆమె ఆశ. ఆమె తప్పేమీ లేదు. కాపరియైన యేసుప్రభువు నేత్రాలు నిన్ను చూడాలనే గొప్ప ఆశ నీవు కలిగి ఉండాలి. నీవు దేవుని ప్రేమిస్తే, నీవు దేవునికి ఎరుకైనవాడివౌతావు. ❀

## యు.పి.ఎఫ్. క్రిస్మస్ సెలబ్రేషన్స్

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2023 డిసెంబరు 18వ తేది సోమవారము సా॥ 5 గం॥ల నుండి రా॥ గం॥ 10.30 ని॥ల వరకు అడిక్‌మెట్, ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

ఈ రోజు అమ్మగారి తండ్రిగారు మన ఆత్మీయ తండ్రియైన రెవ. డా॥ మాథ్యూ గారి 105వ జన్మదినం. ఇలా ప్రతి సంవత్సరం ఇదే రోజున ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ సెమిక్రిస్మస్ సెలబ్రేషన్(క్యాండిల్ లైట్ సర్వీసును) జరుపుకుంటాము.

ఆయన జయంతి సంఘమంతా జ్ఞాపకం చేసుకోవడం ఆశీర్వాదకరమని తెలియజేసి దావీదు కీర్తన 37 వాక్యంను తెలియపరచి, పాస్టర్ మాథ్యూగారు చూపిన విధేయత మాదిరి, జీవించిన జీవితం, అతని సాక్ష్యము వాటన్నింటి కొరకు దేవునికి వందనాలు చెల్లించి, క్రిస్మస్ శుభాలను తెలియజేశాను.

బ్రదర్ అఖిల్‌గారి కుటుంబము మరియు సిస్టర్ చెరిల్ గారి కుటుంబములు కలిసి సెమిక్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్నారు. ప్రతి విభాగంలోని వారు కొరియో, స్కిట్స్ చేసి స్తుతి ఆరాధనలో పాల్గొని దేవుని నామమును మహిమపరచారు.

పాస్టర్ టి.యం. కుమార్ గారు వారి సతీమణి రేచెల్ శాంతి గారు మరియు అరుణ వెనిగల గారు దేవుడు మనలను చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి, రక్షణలోనికి నడిపించిన దేవాది దేవునికి వందనములు తెలియజేశారు.

ప్రసాద్ వెనిగల గారు తండ్రికి విధేయత చూపి, కుమారునిగా ఈ లోకానికి వచ్చిన మన ప్రభువు యేసుక్రీస్తు అని తెలియజేసి ఫిలిప్పి 2:6 ద్వారా వాక్య సందేశాన్ని ఇచ్చారు.

ట్రాన్స్‌జెండర్ సిస్టర్ అంజలి గారు లింగమత భేదం దేవునికి లేదు ప్రతి మనుష్యుని ఆత్మను రక్షించడానికి మనుష్యకుమారునిగా దేవుడే ఈ లోకానికి వచ్చాడని తెలియజేసి తన జీవిత సాక్ష్యాన్ని పంచుకున్నారు.

రెవ. టి.యమ్. కుమార్ గారు తెలుగు మరియు ఇంగ్లీష్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మరియు అరుణ వెనిగల – ప్రసాద్ వెనిగల గారు యు.పి.ఎఫ్. ద్విమాస పత్రిక "దెబోరా స్వరం" విడుదల చేశారు. అలాగే చెరియన్ అయ్యగారు, అమ్మగారు, టి.యమ్. కుమార్ గారు కేక్ కటింగ్ చేశారు. క్యాండిల్ లైట్ సర్వీస్ జయకరంగా జరిగింది.

## క్రిస్మస్ ఆరాధన

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2023 డిసెంబరు 25వ తేది సోమవారము ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 1 గంట వరకు అడిక్‌మెట్‌లోని ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు "ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానము" (లూకా 2:14) అనే వర్తమానమును అందించారు. అమ్మగారు, అయ్యగారు కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవున్ని పాటలతో స్తుతించి, సాక్ష్యములతో ఆయన నామమును ఘనపరిచి మహిమపరచారు.

## వాచ్‌నైట్ సర్వీస్

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2023 డిసెంబరు 31వ తేది ఆదివారము రా॥ 8 గం॥ల నుండి రా॥ 1 గంట వరకు అడిక్‌మెట్‌లోని ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు కీర్తనలు 90:13 నుండి వాక్య సందేశాన్ని అందించారు.

అమ్మగారు, అయ్యగారు, బ్రదర్ అఖిల్ గారి కుటుంబము కేక్ కటింగ్ కార్యక్రమములో పాల్గొన్నారు.

సంవత్సరమంతా దేవుడు మహిమకరంగా యు.పి.ఎఫ్. పట్ల జరిగించిన కార్యములు సేవా సమాచారమును తెలియజేశారు.

గతకాలమంతా కంటికి రెప్పలా కాచి కాపాడిన దేవాదిదేవునికి కృతజ్ఞతాస్తుతులు చెలిస్తూ సండే స్కూల్ చిన్నారుల కొరియోస్‌లతో పాటలతో స్తుతించి, ఆరాధించి ఆయన నామమును మహిమపరచారు.

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 246. "దేవుడు కీడువిషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు - నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అనకూడదు."

- యాకోబు 1:13

శ్రమ, శోధన రెండు వేరు. నీవు దేవుని చిత్తప్రకారం అనేక విషయములు తెలిసికొనుటకు, తర్ఫీదు పొందుటకు వచ్చేది శ్రమ. నీ స్వకీయ దురాశలచేత ఈడ్వబడి పడిపోవడం శోధన. **"దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును."** – యాకోబు 1:15. పాపముచేత ప్రేరేపింపబడిన విశ్వాసి తన దురాశవలన శోధింపబడుతున్నాడు. కావున నీవు మోసపోవద్దు. మీరు నానావిధములైన శోధనలకు గురియౌతారు. మీరు క్రీస్తులో స్థిరంగా ఉంటే దేవుడు మీకు శోధనలను జయించే శక్తిని అనుగ్రహిస్తాడు. మీరు శోధనలను సహిస్తూ లోకమాలిన్యమేమి అంటించుకోకుండా ప్రార్థనచేత వాటిని జయిస్తే మీరు ధన్యులు. మీరు ఆ శోధనలను జయిస్తే దేవుడు వాగ్దానము చేసిన జీవకిరీటము పొందుతారు. **"శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును."** – యాకోబు 1:12. ఎవరైనా శోధనకు గురియైనప్పుడు నేను దేవునిచేత శోధింపబడుతున్నానని అనకూడదు. శోధన ప్రతి ఒక్కరికి వస్తుంది. నాకెప్పుడూ శోధన రాదు; ఏ పాపము నన్ను ప్రేరేపించదు; నేను 100 శాతం పర్‌ఫెక్ట్ అని ఎవరూ చెప్పలేరు. మానవులకు సంబంధించినంతవరకు శోధనలు అందరికీ వస్తాయి. కాని విశ్వాసమందు స్థిరులైనవారు, దేవునికి దగ్గరగా ఉండేవారు, భక్తులు, పరిశుద్ధాత్మతో నింపబడినవారు ఆ శోధనలను సహించి గెలువగలుగుతారు. కావున నీవు శోధనకు తలొగ్గొద్దు. ప్రార్థనద్వారా వాటిని గెలవాలి. పాపము నిన్ను ప్రేరేపించినప్పుడు నీవు పాపుల సహవాసమునకు వెళ్లక విశ్వాసుల గుంపులో ఉండి దివారాత్రులు దేవుని వాక్యాన్ని పఠించాలి; ప్రార్థన చేయాలి. అప్పుడు శోధనలను జయించడానికి నీకు శక్తి ఉంటుంది. నీ ప్రార్థన జీవితం సన్నగిల్లిపోతే; నీకు దేవునితో గల బంధము బలహీనమైతే; నీవు దేవునికి దూరంగా ఉంటే సాతానుడు నిన్ను శోధిస్తాడు. అప్పుడు నీవు శోధనలో పడిపోతావు.

**"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింప గలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగ జేయును."** – 1 కొరింథీ. 10:13. కావున నీవు ప్రార్థన చేయాలి. దేవుడు నీకు చూపిన శ్రేష్ఠమైన మార్గంలోకి వచ్చేయాలి. ఆ శోధనలలో నిలువకూడదు. నీవు దేవుని చిత్తంలో ఉన్న బిడ్డవైతే, దేవుని ప్రేమించేవాడవైతే శోధకుడు నిన్ను శోధించినప్పుడుకూడా నీ విశ్వాసము మెరుగుపరచబడి పదునైన వ్యక్తిగా మారిపోతావు; పాపాన్ని వదిలిపెట్టే సామర్థ్యము పొందుతావు; నీవు పరిశుద్ధాత్మ దేవుని సహాయం వేడినప్పుడు నీ జీవితంలో నమ్మదగిన దేవుని గొప్ప ప్రణాళిక బయలుపరచబడుతుంది. ఏ మాలిన్యము అంటకుండ దేవుడు నిన్ను కాపాడగలడు. కావున నీవు ప్రార్థన చేసి శోధనలను గెలవాలి. నీలో ఏవైనా బలహీనతలుంటే వాటిని అలాగే ఉంచుకొని పెంపొందించుకునే పని చేయకూడదు. ఆ బలహీనతలు ప్రభువు పాదాల దగ్గర పెట్టి ప్రార్థన, ఉపవాసం, దీక్షతో వాటిని జయించాలి. ఎందుకంటే ఈ లోకము, లోకాశలు, శోధనలు, సాతాను, పాపమునకు ప్రేరేపించే దురాశలేవీ నిన్ను సన్మార్గములో నడిపించవు. పైగా అవి నీ ఆత్మీయజీవితాన్ని పతనం చేస్తాయి. నీకు కీడు వస్తుంది. దేవుని శిక్ష, ఉగ్రత నీ మీదకు వస్తుంది గనుక నీవు వాటిని వదిలిపెట్టి ప్రార్థన జీవితమును కలిగియుండాలి.

## 247. "ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధపరచుకొనుడి."

- యాకోబు 4:8

దేవుడు పాపులను వారి పాపజీవితాన్ని వదిలేయాలని కఠినంగా గద్దిస్తున్నాడు. ద్విమనస్కులారా అని వారిని సంబోధిస్తున్నాడు. విశ్వాసులు రెండు తలంపులతో ఉండడం సరికాదు. ఏ కార్యానికైనా రెండు తలంపుల మధ్య తడబడకూడదు. దేవుని ప్రేమించాలంటే ప్రేమించాలి; దేవుని అనుసరించాలంటే అనుసరించాలి; దేవునికి ఇవ్వాలంటే ఇవ్వాలి; దేవుని సేవించాలనుకుంటే సేవించాలి. కాని మరొక తలంపుకు, సాతానుకు లొంగవద్దు. దేవునికి లోబడి అపవాదిని ఎదిరించాలి. నీవు సంపూర్ణంగా దేవుని వైపు ఉండాలని దేవుడు కోరుతున్నాడు.

**"ద్విమనస్కులను నేను ద్వేషించుచున్నాను. నీ ధర్మశాస్త్రము నాకు ప్రీతికరము."** – కీర్తనలు 119:113. దేవుడు ద్విమనస్కులను ద్వేషిస్తాడు. కొంత ఇటు, కొంత అటు ఉండకూడదు. అలా దేవుని దగ్గర ఏనాడు చెల్లదు. లోకము, దేవుడు అంటే రెండిట్లో ఎటూ ఉండవు.

**"-నీ క్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను వెచ్చగానైనను లేవు; నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు. నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చనగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను."** – ప్రకటన 3:15,16. అటువంటి దౌర్భాగ్యపు స్థితి విశ్వాసికి ఎప్పుడూ రాకూడదు. నీవు ఎప్పుడూ వెచ్చగానే ఉండాలి. దేవునికొరకు మండుతుండాలి. నీవు ఎప్పుడూ దేవుడు అనుగ్రహించిన ఈ సత్యంలోనే నడవాలి. లోకము, లోకస్నేహము, పాపముతో రాజీపడకూడదు. అలా చేస్తే నీవు ద్విమనస్కుడవని అర్థం. ఆలయంలో భక్తి, వెలుపల పాపజీవితం విశ్వాసికి ఏమాత్రము తగవు. కావున నీవు నీ హృదయాన్ని పరిశుద్ధపరచుకోవాలి. పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడని దేవుడు చెబుతున్నాడు. మీ చేతులు మలినమైపోయాయి. గనుక మీకు పరిశుద్ధత అవసరము. కావున మీరు పశ్చాత్తాప హృదయంతో దేవునియొద్దకు రావాలి. దేవునియొద్దకు రండి; అప్పుడాయన మీ యొద్దకు వస్తాడు. గగనము చీల్చుకొని నీ మధ్యకు వచ్చేస్తాడు. ఎప్పుడైతే నీ హృదయంలో ఉన్న పాపాన్ని ఒప్పుకొని క్షమాపణ వేడుకుంటావో అప్పుడు దేవుడు తప్పక నిన్ను క్షమిస్తాడు. క్రీస్తు రక్తం అపవిత్రతనుండి నిన్ను విడిపిస్తుంది.

## 248. "వ్యభిచారిణులారా, యీ లోకస్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును."

- యాకోబు 4:4

ఎవడు ఇద్దరు యజమానులకు దాసుడు కాలేడు. నీవు దేవుని

ప్రేమించాలి. అలాగే లోకాన్ని, సిరిని ప్రేమిస్తానంటే వీలుకాదు. అది వ్యభిచారంతో సమానం. దీన్ని ఆత్మసంబంధమైన వ్యభిచారమని అర్థం చేసికోవాలి. సాధారణంగా అక్రమసంబంధము గలవారిని వ్యభిచారులని సంబోధిస్తారు. కాని విశ్వాసంలో నిలకడగా లేనివారు; దేవుని ప్రేమిస్తూ. లోకాన్ని కోరుకునేవారు; జీవితంలో రెండు రకముల కార్యాలను చేసేవారిని వ్యభిచారులని ఇక్కడ సంబోధింపబడింది. ఈ రోజుల్లో ఇలాంటివారిని మనము తరచుగా చూస్తుంటాము. విశ్వాసులైనవారుకూడ లోకాకర్షణలకు లొంగిపోయి దేవునికి మహిమ తేలేని పరిస్థితుల్లో ఉండడమును గమనించవచ్చు. **"సహోదరులారా, జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి."** – హెబ్రీ. 3:12. జీవముగల దేవుని వదిలిపెట్టే దుష్టహృదయము, భ్రష్టత్వం నీలోకి వచ్చిందేమో జాగ్రత్తగా చూచుకో. నాకు దేవుడు వద్దు; ఈ లోకము, ఈ పాపము, ఈ అక్రమసంబంధము చాలు; నేను దేవునికంటే దీన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాను; ఎక్కువగా ఈ కార్యాన్నే తలస్తున్నాను అంటే తప్పకుండా 'వ్యభిచారిణులారా' అనే సంబోధన నీకే వర్తిస్తుంది. నీవు ఆత్మసంబంధమైన వ్యభిచారంలో ఉండి దేవునికి అయిష్టమైన కార్యం చేస్తున్నావని అర్థం. నీవు దేవునికంటే అధికంగా దేన్నీ ప్రేమించవద్దని వాక్యంలో ఉంది. దేవునికి ఇచ్చే స్థానాన్ని దేవునికి గాక మరెవరికి ఇచ్చినా అది వ్యభిచారంతో సమానము. నీ జీవితంలో దేవునికి ప్రథమ ప్రాధాన్యమివ్వాలని దేవుడు కోరుతున్నాడు. మనకొరకు ఎవరూ ప్రాణం పెట్టలేదు. యేసుప్రభువే మనకొరకు తన ప్రాణం పెట్టాడు గనుక మనమాయనను ప్రేమించ బద్ధులమైయున్నాము. ఆయనను ప్రేమించడమంటే ఆయన ఆజ్ఞలను గైకొనడమే. ఈ లోకాన్ని ప్రేమిస్తే నీలో దేవుని ప్రేమ ఉండదు. **"ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును."** – 1 యోహాను 2:15–17. కొందరు లోకాన్ని ఎంతో ప్రేమిస్తారు. వారి సంపాదనలో కొంతైనా దేవునికి ఇవ్వడానికి నిరాకరిస్తారు. దేవుని సేవకు, సేవకులకు సహాయపడుటకు ఒప్పరు. ఎందుకంటే వారు లోకాన్ని, లోకరీతి సౌఖ్యాన్ని, ధనాన్ని ఎక్కువగా ప్రేమిస్తారు. కాని అలాంటివారికి దేవుని ప్రేమ గిట్టదు. ఎందుకంటే దేవునికి ఇవ్వకుండా ఎవరూ పైకి రాలేరు; ఇచ్చి ఎవరూ తక్కువ కాలేరు. **"భ్రష్టులైన బిడ్డలారా, తిరిగి రండి; మీ అవిశ్వాసమును నేను బాగు చేసెదను;"** – యిర్మీయా 3:22. ఇక్కడ ప్రభువు 'భ్రష్టులైన బిడ్డలారా' అని సంబోధిస్తున్నాడు. అంటే నీలో భ్రష్టత్వము ఉన్నా నీవు దేవుని బిడ్డవే. కనుక నీవు బాగుపడాలని ఆయన నిన్ను శిక్షిస్తున్నాడు. కావున నీవు దేవునియొద్దకు రావాలి; దేవుని ఆజ్ఞలను విని నీ హృదయాన్ని శుద్ధి చేసికోవాలి; దేవునితో సహవాసము కలిగి ఉండాలి. నీకొరకు ప్రాణము పెట్టిన ప్రభువును ఎక్కువగా ప్రేమించాలి.

## 249. "ప్రభువురాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి." – యాకోబు 5:8

**"సహోదరులారా, ప్రభువు రాకడవరకు ఓపిక కలిగి యుండుడి; చూడుడి; వ్యవసాయకుడు తొలకరి వర్షమును కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన భూఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దానికొరకు కనిపెట్టును గదా."** – యాకోబు 5:7. ప్రభువు రాకడ చాలా సమీపముగా ఉన్నది గనుక మీ హృదయాన్ని స్థిరపరచుకోవాలి. మీకు నానా విధములైన పరీక్షలు, శోధనలు వచ్చినప్పుడు మీ హృదయాన్ని నిబ్బరంగా ఉంచుకోవాలి. నీవు శ్రమల్లో తొణకకూడదు; బెణకకూడదు; సణగకూడదు; విసుగకూడదు. దేవుడు నీ హృదయంలో ఉన్నాడు; నీ పక్షమందు ఉన్నాడు గనుక భయపడవద్దు. దేవుడు నా పక్షమందు ఉన్నాడు గనుక నేను కదిలింపబడనని భక్తుడు అంటున్నాడు. పరిస్థితులు ఏ విధంగా ఉన్నా, నాకైతే నా దేవునిపొందు ధన్యకరమని మరొక భక్తుడు అంటున్నాడు. అలాగున జీవించిన అనేకమంది భక్తులను నీకు మాదిరిగా యుంచుకొని జీవిత ప్రయాణంలో నీవు స్థిరమైన విశ్వాసమును కలిగి ఉండాలి. నీ హృదయాన్ని నిబ్బరంగా ఉంచుకోవాలి. ❀

## నూతన సంవత్సర ఆరాధన

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2024 జనవరి 1వ తేది సోమవారము ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 1 గంట వరకు అడిక్‌మెట్‌లోని ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు నూతన సంవత్సర శుభాలను తెలియజేసి **"నీవు ఆశీర్వాదముగా నుందువు"** (ఆది కాం. 12:2) అనే వర్తమానమును అందించారు.

యు.పి.ఎఫ్. సంఘ కాపరులు నూతన సంవత్సర శుభాలను తెలియజేసి క్లుప్త వర్తమానము అందించారు.

దేవున్ని పాటలతో స్తుతించి, ఆరాధించి ఆయన నామమును మహిమపరచారు.

## యు.పి.ఎఫ్. కృతజ్ఞత కూడిక

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంతో 2024 జనవరి 23వ తేది మంగళవారము సా॥ 5 గం॥ల నుండి రాత్రి 10 గం॥ల వరకు అడిక్‌మెట్‌లోని ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎంతో జయకరంగా జరిగింది.

గతించినకాలమంతా దేవుడు మన ఆత్మీయ తల్లి రెవ. డా. జాయ్ చెరియన్ గారిని ఆయన సేవలో బహుబలముగా నడిపించి, మరియొక నూతన సంవత్సరమును దయాకిరీటముగా ఇచ్చినందుకు దేవాది దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ చిన్నారులు మొదలు పెద్దలవరకు ప్రతిఒక్కరూ దేవుణ్ణి పాటలతో స్తుతిస్తూ ఆరాధిస్తు ఆయన నామమును ఘనపరచారు.

దేవుని సేవలో కొనసాగుతున్న తొమ్మిదిమంది స్త్రీలకు రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు ఆర్డినేషన్ ఇచ్చి, వారిచే ఒప్పందాలు చేయించి సర్టిఫికెట్స్ మరియు పరిశుద్ధ గ్రంథాలను ప్రదానం చేసి హస్త నిక్షేపన ప్రార్థన చేశారు.

చెరియన్ అయ్యగారు, రెవ. టి.ఎమ్. కుమార్ దంపతులు, రెవ. బి. సామ్యేల్ బాబు దంపతులు, రెవ. డేవిడ్ ప్రశాంత్ గొల్లపల్లె గారు మరియు అమ్మగారి జ్యేష్ఠ కుమారుడు అఖిల్ చెరియన్ గారు, యు.పి.ఎఫ్. పాస్టర్లు కేకు కటింగ్ కార్యక్రమంలో పాల్గొని అమ్మగారికి జన్మదిన శుభములు తెలియజేశారు. అదేవిధముగా యు.పి.ఎఫ్.లోని అనేక విభాగములవారు అమ్మగారికి జన్మదిన శుభములు తెలియజేశారు.

రెవ. డేవిడ్ ప్రశాంత్ గొల్లపల్లె గారు "ఒక స్త్రీ" అనే క్లుప్త సందేశాన్ని అందించారు. పాల్గొన్న వారికందరికి ప్రేమ విందు ఏర్పాటుచేయబడింది. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లిస్తున్నాము.

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. స్వాతి ఆరవ:** నాకు కొద్ది రోజులుగా కడుపు నొప్పి వస్తుంది. నేను గ్యాస్టిక్ ప్రాబ్లెమ్ అనుకొని గైనకాలజిస్టు దగ్గరకు వెళ్లాను. డాక్టర్ – స్కాన్ చేయించుకోమని వ్రాశారు. ఆ ప్రకారమే స్కానింగ్ చేయించుకున్నాను. రిపోర్ట్ డాక్టర్‌కి చూపిస్తే నా గాల్ బ్లాడర్‌లో రాయి ఉంది సర్జన్ డాక్టర్‌ని కలవమని చెప్పారు. నేను వెంటనే సర్జన్‌ని కలిసినప్పుడు వెంటనే సర్జరీ చేయాలి లేకపోతే పాలిప్ అది క్యాన్సర్‌గా మారుతుంది అని చెప్పారు. నేను యు.పి.ఎఫ్.కి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం ఇచ్చాను. దేవుని మహాకృపనిబట్టి సర్జరీ విజయవంతముగా జరిగింది. ప్రార్థించిన యు.పి.ఎఫ్. సభ్యులందరికీ వందనాలు.

**2. రోజామణి:** నాకు జనవరి నెల 2022వ సం॥లో బాగా జ్వరం వచ్చింది అది కొవిడ్ సమయం అందరూ డాక్టర్‌కి చూపించుకోమని చెబుతున్నారు. నేను డాక్టర్ దగ్గరకు వెళ్లి చూపించుకుంటే కొవిడ్ పాజిటివ్ అని తెలిసింది. అప్పుడు నేను నా మనస్సులో "అవును ప్రభువా నీ బిడ్డలముగా మేము ఉన్నాము కాబట్టి నీవు మాకు కాపుదల ఉంచుతావు అని అనుకున్నాను. అలాగే మన ఆత్మీయ తల్లి జాయ్ చెరియన్ అమ్మగారి కౌన్సెలింగ్‌ద్వారా ఎంతో ధైర్యం, ఆదరణ, కుటుంబాలను కట్టుకోవడం ఈ విధముగా దేవునికి దగ్గరగా ఉంటున్నాము. ఈ జూమ్‌ద్వారా దేవుని సన్నిధి మన దగ్గరకు వస్తుంది. దేవుని కృపనుబట్టి దేవుని నామములు వల్లించడం, ధ్యానించడంవల్ల దేవుడు నన్ను కాపాడి తన కృపలో నడిపించినందుకు దేవునికి స్తోత్రములు. నా గురించి ప్రార్థన చేసిన యు.పి.ఎఫ్. సభ్యులందరికి, ఆత్మీయ తల్లికి నా ప్రత్యేక వందనాలు.

**3. విజయ రాణి:** నేను జూమ్‌ద్వారా ఎన్నో దీవెనలు పొందాను. అసాధ్యమైన కార్యాన్ని దేవుడు నా జీవితంలో సాధ్యపరచాడు. నా కుమారుడు రోహిత్ కి తండ్రి లేడు. వాడిని ఇంటర్మీడియట్‌లో జాయిన్ చెయ్యాలి కాని ఎలాంటి ప్రూఫ్స్ లేవు. మేము మొదటిసారి అప్లై చేస్తే తిరస్కరణకు గురయింది. వెంటనే నేను యు.పి.ఎఫ్.కి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం తెలియజేశాను. దేవుని మహా కృపనుబట్టి డాక్యుమెంట్స్ ఏర్పాటు చేసికోగలిగాను. అలాగే బాబుకి పరీక్ష సమయంలో చెయ్యి తెగింది. పరీక్ష వ్రాయలేని పరిస్థితి. జాయ్ అమ్మగారి ప్రార్థనలద్వారా, జూమ్ బిడ్డల ప్రార్థనలవల్ల బాబుకి 81% వచ్చింది. బాబు ఏమీ చదవలేదు. అయినా దేవుడు కృప చూపించి అతనికి జ్ఞానం యిచ్చి తోడుగా ఉండి పరీక్షలు వ్రాయించాడు. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక. యు.పి.ఎఫ్. బిడ్డలందరికి, ఆత్మీయ తల్లికి నా నిండు వందనాలు.

**4. ప్రభుదేవ కుమారి:** నేను యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం తెలియజేశాను. మా అక్కవాళ్లు అమెరికాలో ఉంటారు. వాళ్ల బాబు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేశాడు. ఇండియాలో ఎం.సెట్ లాగే వాళ్లకి అక్కడ సెట్ అనే పరీక్ష ఉంటుంది. దేవుని మహా కృపనుబట్టి అతనికి 1600 కి 1470 మార్కులు వచ్చాయి. మా అక్క వాళ్లు ఏదైతే అనుకున్నారో అలాగె ఒక్క సంవత్సరం తర్వాత బాబు ఇంజినీరింగ్‌లో జాయిన్ అయ్యాడు. అలాగే జార్జియా యూనివర్సిటీల్లో బాబుకి సీటు రావడానికి దేవుడు మార్గాన్ని సరాళము చేశాడు. దేవునికే మహిమ చెల్లిస్తున్నాను. యు.పి.ఎఫ్.లో ఏ ప్రేయర్ రిక్విస్ట్ యిచ్చినా సంఘము ఎంతో ఆసక్తి కలిగి ప్రార్థించడం – దేవుని కృపనుబట్టి జవాబు పొందడం చాలా అద్భుతం. జాయ్ అమ్మగారికి నా ప్రత్యేక వందనాలు. యు.పి.ఎఫ్. సభ్యులందరికి నా కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

**5. శాంతి:** నేను యు.పి.ఎఫ్.కి నా చిన్నప్పటి నుండి వస్తున్నాను. 2020వ సంవత్సరంలో దేవుడు ఒక అసాధ్యమైన పనిని సాధ్యపరచాడు. నా కుమారుడు NEET పరీక్ష కోసం సిద్ధపడుతున్నాడు. 2020వ సం॥లో కరోనా వల్ల కాలేజీలన్నీ మూసివేశారు. దీనితో పాటు మాకు చాలా ఆర్థిక సమస్యలు ఉన్నాయి. అయినా నేను క్రుంగిపోకుండా ఆత్మీయ తల్లిగారు జాయ్ అమ్మ చెప్పినట్లు ఎప్పుడూ దేవునితో సంబంధము కలిగి వాగ్దానములు వ్రాస్తున్నాను. "దహించు అగ్ని" అనే వాగ్దానం వ్రాస్తూ ఎక్కువ సమయం ప్రార్థనలో ఉండేదాన్ని. ఇలా చేయడం వల్ల నాకు ఎంతో ధైర్యం, సంతోషం కలిగింది. నా కుమారునికి మొదటి ప్రయత్నంలో సీటు రాలేదు. నిరీక్షణతో మనము అడిగిన దేవుడు నమ్మదగిన దేవుడు, తప్పకుండా ఇస్తాడు అని అమ్మగారు చెప్పిన వాగ్దానముద్వారా నిరాశ పడకుండా కనిపెట్టినప్పుడు నేను పొందిన మేళ్లు లెక్కలేనన్ని మరియు అవి వ్రాయాలంటే కూడా అసాధ్యము. రెండోసారి నా కుమారుడు NEET వ్రాసినప్పుడు సి–కేటగిరీలో కామినేని మెడికల్ సైన్సెస్‌లో సీటు వచ్చింది. కాలేజి ఫీజు లక్షల్లో ఉంటుంది. చాలా కష్టంగా మొదటి సంవత్సరం ఫీజు కట్టగలిగాము. మళ్లీ రెండో ఏడు ఫీజు కట్టమని నోటీసు ఇచ్చారు. అప్పుడు నేను జాయ్ అమ్మగారు చెప్పినట్లు "శ్రీమంతుడు" అనే నామము వ్రాసి ప్రార్థించడం మొదలు పెట్టాను. ఎంతో అద్భుత రీతిలో మాకు తెలిసినవారిద్వారా మేము కట్టగలిగేంతలో ఫీజులో కన్సెషన్ యిచ్చారు. దేవుడెంతో ఆశ్చర్యకరంగా భారము తగ్గించాడు. ఇంకా నేను దేవునిలో ఎక్కువగా నాటబడి అంతమువరకు నా విశ్వాసమును కొనసాగించాలని, దేవుని నామమును అందరికీ వ్యాప్తిచేయాలని, నా కుటుంబమంతా దేవుని తట్టు తిరిగి ఉండాలని నేనెంతగానో ఆశిస్తున్నాను. సమస్త మహిమ దేవునికే చెల్లునుగాక! ఆత్మీయ తల్లి జాయ్ అమ్మగారికి నా ప్రత్యేక వందనములు.

**6. చందవేణి:** మేము యు.పి.ఎఫ్.లో అడుగు పెట్టినప్పటినుండి మా జీవితములో ఎన్నో మేళ్లు అనుభవించాము. మాకు నలుగురు పిల్లలు. మా పెద్ద కుమార్తె రమ్య వివాహము 17-8-2023న ఎంతో ఘనంగా జరిగింది. ఈ వివాహముకొరకు సంఘమంతా ప్రార్థించారు. జాయ్ అమ్మగారైతే వివాహము కానివారి పేర్లన్నీ వ్రాసికొని దానియేల్ ఉపవాసములో ఆ పేర్లమీద చేతులు పెట్టి ప్రార్థించారు. ఆవిధంగా రమ్య వివాహ విషయంలో దేవుడు గొప్ప కార్యం చేశాడు. మొదట వివాహ ప్రతిపాదన వచ్చినప్పుడు మేము బాబుని చూసి వచ్చామని జాయ్ అమ్మతో చెప్పాను. అప్పుడు అమ్మగారు దేవుని చిత్తమే జరగాలని చెప్పి నన్ను సామెతలు 21:31 వచనము వ్రాయమన్నారు. నేను అప్పటినుండి ఆ వచనము వ్రాయడం మొదలుపెట్టాను. అదేకాకుండా రమ్య పుట్టిన రోజున అమ్మగారు ఒక బైబిలును బహుమతిగా యిచ్చి మంచి భర్త రావాలని బైబిల్లో వ్రాసి ప్రార్థన చేసి రమ్యకిచ్చారు. ఆవిధముగా దేవుడు అమ్మగారి మాటలను స్థిరపరచాడు. అలా దేవుడు గొప్పకార్యం చేశాడు. ప్రార్థించిన అమ్మ గారికి, యు.పి.ఎఫ్. సంఘ సభ్యులందరికి నా ప్రత్యేక వందనాలు. సమస్త మహిమ దేవునికే చెల్లునుగాక.

**7. జాన్:** నేను సుచిత్ర నుండి రెండు నెలలుగా ఈ సంఘానికి వస్తున్నాను. నేను ఈ సంఘానికి రావడం కేవలం అమ్మగారి వాక్యం. నేను మార్పు చెందుతానో లేదో అనే నమ్మకం నాకెలా కలిగిందంటే – నేను ఖాళీ (తీరిక) సమయంలో టి.వి. చూస్తుంటాను. ఛానల్స్ అన్నీ మారుస్తుంటే ఒక ఛానల్లో అమ్మగారి మెసేజి వస్తుంది. ఆ వాక్యం విన్నప్పుడు నాలో పరివర్తన కలిగింది. జాయ్ అమ్మగారితో ప్రార్థన చేయించుకున్నప్పుడు నేను పూర్తిగా మార్పు చెందాను. దేవుని వాక్యం, దేవుని సన్నిధి ఇక్కడ ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అమ్మగారి వాక్యం నన్ను మార్చేసింది. నేను మారడం అనేది నా జీవితంలో పెద్ద అద్భుతం. జాయ్ అమ్మగారికి నా ప్రత్యేక వందనాలు. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక.

**8. మేరి జోసఫ్:** 2023 నవంబరు 13న మా నాన్నగారికి ఛాతిలో నొప్పి వస్తుందని ఇ.సి.జి. తీయించాము. రిపోర్టు చూసి కొంచెం స్ట్రోక్ వచ్చే అవకాశముందని ఆంజియోగ్రామ్ చేయాలని చెప్పారు. మా నాన్న వాళ్లు ఆంధ్రాలో ఉంటారు. ఇంకా దేవుని నమ్ముకో లేదు. అయితే నేను వెంటనే యు.పి.ఎఫ్. ప్రేయర్ వారియర్స్‌కి ప్రార్థన విన్నపం ఇచ్చాను. నాన్నగారికి మాటలు రావు చెవులు కూడా వినిపించవు. టెస్ట్ చేయాలని చెప్పటానికికూడా అర్థంకాని పరిస్థితి మా నాన్నగారిది. నేను మా నాన్న గారి గురించి ప్రార్థన చేస్తూ "దహించు అగ్ని" అని కూడా నాన్న పేరుతో వ్రాయడం చేశాను. మేము రెండో అభిప్రాయంకొరకు మరో ఆసుపత్రిలో కూడా చూపించాము. అక్కడి డాక్టర్లు 90% ఫర్వాలేదు 10% చెప్పలేమన్నారు.

అద్భుతంగా మా నాన్నగారు ఎంతో చక్కగా టెస్టులన్నిటిలో సహకరించారు. దేవుడు గొప్ప కార్యం చేశాడు. ఆ టెస్ట్‌లో నాన్నకి 45% బ్లాక్ ఉందని తెలిసింది. అయినా కూడా స్టెంట్ వేయకుండా మందులతో బ్లాక్ అంతా క్లియర్ అవుతుందని చెప్పారు. మా నాన్న గురించి ప్రార్థన చేసిన యు.పి.ఎఫ్. సభ్యులందరికి, జాయ్ అమ్మ గారికి నా ప్రత్యేక వందనాలు. దేవునికే సమస్త ఘనత మహిమ చెల్లును గాక.

**9. మీనా కుమారి:** నేను ఉద్యోగంలో చాలా సమస్యలతో బాధపడుతూ ప్రార్థన చేయించుకుందామని యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చాను. అప్పుడు జాయ్ అమ్మ దానియెల్ ఉపవాసం ప్రారంభిస్తున్నాము. నీతోనే మొదలు పెడతామని చెప్పారు. 21 రోజులు దానియల్ ఉపవాసంలో ఉండమని కష్టాలవైపు చూడవద్దు, మనుష్యులవైపు చూడవద్దు. కేవలం దేవుని వైపు చూడమన్నారు. నేను ప్రార్థన చేయించుకుని వెళ్లాను. నేను విజయా డయాగ్నొస్టిక్‌లో టైపిస్టుగా పని చేస్తున్నాను. నాతో టైపిస్టుగానే కాకుండా టెక్నీషియన్‌గాకూడా పని చేయించుకునేవాళ్లు. నా వయస్సు 58 సం॥రాలు. చాలా బలహీనంగా అయిపోయేదాన్ని. చాలా ఒత్తిడి ఉండేది. దేవా, మనుష్యులకు తెలియదు. నాయనా, నాలో ఉండే నొప్పులు, కేవలం నీవే ఎరుగుదువు అని ఏడ్చి రోజూ నేను దేవునితో మొఱ్ఱపెట్టుకునే దాన్ని. ఈ 21 రోజుల దానియెల్ ఉపవాసం ద్వారా దేవుడు అద్భుతరీతిగా నా మొఱ్ఱ ఆలకించి కేవలం ఆయన కృపద్వారా నన్ను ఉద్యోగంలో ఎలా పెట్టాడంటే, టెక్నీషియన్‌గా మరో అమ్మాయిని తీసికున్నారు. నన్ను కేవలం టైపిస్టుగానే పెట్టారు. నేను మూడు చోట్ల తిరుగుతు టైప్ చేయవలసి వచ్చేది. మూడు బ్రాంచీలు తిరుగుతు టైప్ చేసే దాన్ని ఈ సమస్యనుకూడా నేను ప్రార్థనలో పెట్టాను. దేవుడు అద్భుతరీతిగా కార్యం చేశాడు. నాకు ప్రత్యేకంగా ఒక గది ఇచ్చారు. అక్కడే సిస్టమ్‌లో పని చేసేదాన్ని. అక్కడున్న మనుష్యులను కూడా దేవుడు మార్చాడు నేను నా గదిలో టైపింగ్ చేసికుంటూ, దేవుని పాటలు వింటూ ఎంతో ఆనందిస్తున్నాను. నా గురించి ప్రార్థించిన జాయ్ అమ్మగారికి ప్రత్యేక వందనాలు. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక!

**10. గ్రేస్:** నాకు నవంబరు 13వ తేదీన ప్రమాదం జరిగింది. కాలి బొటనవేలికి 7 కుట్లు వేశారు. పండుగ దినాల్లో ఇలా జరగడం నాకు చాలా బాధ అనిపించింది. ఒక నెల తర్వాత కుట్లు తీశారు. అప్పుడు డాక్టరు నడవమన్నారు. కాని నేను ఎంతగా ప్రయత్నించినా నడవలేకపోతున్నాను. యు.పి.ఎఫ్. సెమి క్రిస్మస్‌కికూడా అలాగే వచ్చాను. విద్యానగర్‌లో డిసెంబరు 21న సెమి క్రిస్మస్ జరిగింది. అక్కడకి నేను వెళ్లి జాయ్ అమ్మతో ప్రార్థన చేయించుకున్నాను. జాయ్ అమ్మ ప్రార్థించిన తర్వాత నాకు చాలా రిలాక్స్‌గా అనిపించింది. ఆ ప్రార్థన అయిన మరుసటి రోజు నాకు తెలియకుండానే నడిచాను. నడక వచ్చేసింది. అప్పటివరకు వాకర్ సహాయంతో నడిచిన నేను జాయ్ అమ్మగారి ప్రార్థన తర్వాత నార్మల్‌గా నడవడానికి దేవుడు అద్భుతంగా సహాయం చేశాడు. నా గురించి ప్రార్థించిన జాయ్ అమ్మగారికి, ప్రార్థన వీరులకు నా ప్రత్యేక వందనాలు. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక!

**11. మోనిక స్టీవెన్:** 2021 మే నెలలో నా వివాహం జరిగింది. మేము 2023 జనవరిలో జాయ్ అమ్మగారిని కలిసి ప్రార్థన చేయించుకున్నాము. జాయ్ అమ్మ ప్రార్థించిన ఒక నెలలోనే నేను గర్భము ధరించాను. గర్భిణీ సమయంలో ఆరోగ్యపరంగా చాలా హెచ్చుతగ్గులు వచ్చాయి. 3వ నెలలో స్కానింగ్ చేసి బేబి బ్లాడర్ చాలా పెద్దగా ఉంది నార్మల్ డెలివరి కష్టమని చెప్పారు. అప్పుడు మేము యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం ఇచ్చాము. జాయ్ అమ్మగారుకూడా మా గురించి ప్రార్థన చేశారు. ఒకరోజు తర్వాత మేము మళ్లీ ఆసుపత్రికి వెళ్తే అంతా నార్మల్‌గా ఉంది అని చెప్పారు. తర్వాత 6 నెలలకి నాకు నార్మల్ డెలివరిద్వారా దేవుని మహాకృపనుబట్టి చక్కని బాబు పుట్టాడు. నా గురించి ప్రార్థించిన ప్రార్థన వీరులకు, జాయ్ అమ్మగారికి మరియు యు.పి.ఎఫ్. సంఘ సభ్యులందరికి నా ప్రత్యేక వందనాలు. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లును గాక! ❀

## అంత్యకాల ప్రవచనములు

రెవరెండ్ డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు "అంత్యకాల ప్రవచనములు" అనే క్రొత్త కార్యక్రమమును 2024 జనవరి 04 వ తేది గురువారము నుండి సా॥ 6 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు రాంనగర్‌లోని యు.పి.ఎఫ్. ప్రార్థనా గోపురంలో ప్రారంభించారు. జయకరంగా జరుగుతోంది.

## ఫ్యామిలీ రిట్రీట్

2024 జనవరి 26వ తేదీ శుక్రవారమున "యు.పి.ఎఫ్. ఫ్యామిలీ రిట్రీట్" ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు ఎంతో జయకరంగా జరిగింది.

రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు **"యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే."** - కీర్తనలు 127:1 అనే వర్తమానమును, సహో. అంశుమతి మేరీ గారు **"శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను."** - యిర్మీయా 31:3 వాక్యం వర్తమానమును, పాస్టర్ కిరణ్ కుమార్ గారు ఎఫెసి. 6:22-24 వాక్యం ద్వారా వర్తమానమందించారు.

అమ్మగారు ప్రతి ఒక్కరికి నూనెరాచి కుటుంబాల కొరకు ప్రార్థన చేశారు. అందరికీ ప్రేమవిందు ఏర్పాటు చేయబడింది.

## ప్రేయర్ సెల్ & జూమ్ లీడర్స్ మీటింగ్

2024 జనవరి 30వ తేదీ మంగళవారము ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు రాంనగర్‌లోని యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో జయకరంగా జరిగింది.

ప్రేయర్ సెల్ లీడర్స్ అందరూ వారివారి గృహాలలో ప్రార్థనలు ఎలా జరుగుతున్నాయో వివరించి, దేవుడు వారి కుటుంబాలలో చేసిన మేళ్లను సాక్ష్యాలుగా పంచుకుని దేవుని నామమును మహిమపరచారు.

రెవ. డా. జాయ్ చెరియన్ అమ్మగారు ప్రేయర్ సెల్ & జూమ్ లీడర్లకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి - **"దేవుని మందసము దీవెనకు కారణం"** - 2 సమూ. 6:11 అనే వర్తమానమందించారు.

అదేరోజున పదిహేడు ప్రేయర్ సెల్‌లను ప్రారంభించి నామకరణం చేశారు. అందరికీ ప్రేమవిందు ఏర్పాటు చేయబడింది. దేవునికే సమస్త మహిమ ఘనత చెల్లునుగాక!

రండి! పాల్గొనండి!! ఆశీర్వదింపబడండి!!!

"సిలువనుగూర్చిన వార్త, నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి." - 1 కొరింథీ. 1:18

# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)



నిర్వహించు

# సిలువ ధ్యానములు

## (40 రోజులు ఉపవాస ప్రార్థనలు)

**తేదీలు : 2024 ఫిబ్రవరి 19 నుండి మార్చి 29 వరకు**

**సమయము : ప్రతి రోజు ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ల వరకు**

**స్థలము : సెంటినరి బాప్టిస్టు చర్చి, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.**

**విలువైన వర్తమానములను అభిషిక్తుల ద్వారా వినండి!**
**ఆత్మీయ ఆశీర్వాదములను పొందండి!!**
**మీ అవసరతల నిమిత్తము ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**

గమనిక : రాంనగర్ ఈ-సేవ నుండి సెంటినరి బాప్టిస్టు చర్చి వరకు బస్సు సౌకర్యము కలదు.

## ఈస్టర్ ఆరాధన

31వ తేదీ మార్చి 2024 ఉ॥ 10.00 గం॥లకు
స్థలం : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, అడిక్‌మెట్, హైదరాబాద్.

యూట్యూబ్, ఫేస్‌బుక్ మరియు జూమ్ ప్రత్యక్ష ప్రసారము ద్వారా పాల్గొనవచ్చును.
జూమ్ మీటింగ్ ఐడి: 9550504718 పాస్ కోడ్ : 7777

**అందరికీ ఆహ్వానము**

**వివరములకు ఫోన్ :**
**9550504718, 9030757571**
**Our Website : www.upf.org.in**

ప్రభువు దాసురాలు
**- జాయ్ చెరియన్**
ఫౌండర్ ప్రెసిడెంట్ (UPF)

# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్ ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ., ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

1) **"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** 1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **వెల రూ. 150/- (each one)**

2) **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** 1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **వెల రూ. 150/-**

3) **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** 1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **వెల రూ. 150/- (each one)**

4) **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **వెల రూ. 150/-**

5) **"అద్భుత కార్యములు" - Vol - I to IV** **వెల రూ. 150/- (each one)**

6) **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) **వెల రూ. 150/-**

7) **"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**

8) **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**

9) **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) **వెల రూ.20/-**

10) **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**

11) **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**

12) **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**

13) **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) **వెల రూ. 20/-**

14) **"తల్లి ఒప్పుకోలు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**

15) **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 20/-**

16) **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 20/-**

17) **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**

18) **"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**

19) **"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**

20) **"నూతన సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 60/-**

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** – దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 32 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 32 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు–**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** – సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

### United Peoples Fellowship Trust Building Fund Account

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 630501062130** **Bank : ICICI - Himayat Nagar Branch** **IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



# యు.పి.ఎఫ్. కార్యక్రమాలు

**1. ఆదివారము ప్రభాత తెలుగు ఆరాధన :**
ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు

**సాయంకాల తెలుగు ఆరాధన :**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

యు.పి.ఎఫ్. ఆలయంలో ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు **డిజిటల్ సర్వీస్** జరుగును.

**ఇంగ్లీషు మరియు హిందీ ఆరాధన :**
సా॥ 4.00 గం॥ల నుండి 6.00 గం॥ల వరకు
**జూమ్‌లో మాత్రమే జరుగును.**

**సండే స్కూల్ :** ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్,
బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

**2. సోమవారము:**
**తల్లుల సహవాసము & మండే స్కూల్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

**3. మంగళవారము : యంగ్ ఉమెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు

**4. బుధవారము : తేనెధారలు కార్యక్రమము**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

**5. గురువారము : వాలంటీర్స్ మీటింగ్ & అంత్యకాల ప్రవచనములు**
సా॥ 7.00 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు

**6. శుక్రవారము :**
**ప్రభాత ఆరాధన -** ఉ॥ 5.00 గం॥లకు
**గ్రాండ్ పేరెంట్స్ మీటింగ్ -** ఉ॥ 10.00 గం॥లకు
**శుక్రవారము ఉపవాస ప్రార్థన -** సా॥ 6.00 గం॥లకు

**7. శనివారము :**
**యౌవనస్థుల కూడిక & మెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : యు.పి.ఎఫ్. ఆలయం, రాంనగర్‌లో జరుగును.

**24/7 నిరంతర ప్రార్థనలు**
రాత్రింబవళ్ళు, నిరంతరము జూమ్‌ద్వారా ప్రార్థనలు జరుగును
ప్రతి నెల చివరి బుధవారము **సంపూర్ణ రాత్రి ప్రార్థన**
సమయం : రా॥ 9.00 గం॥ల నుడిం ఉ॥ 5.00 గం॥ల వరకు
స్థలం : సెంటినరి బాప్టిస్టు చర్చి, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.
ప్రతి నెల మొదటి ఆదివారము **కుటుంబ ఆదివారము**
సమయం: ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.
ప్రతి నెల చివరి ఆదివారము **అంత్యకాల సంభవాలు - బైబిల్ ప్రవచనాలు - ప్రపంచ భవిష్యత్తు**
సమయం : సా॥ 6.00 గం॥లకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి సం॥ జనవరి 26వ తేది **ఫ్యామిలీ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్.

ప్రతి సం॥ ఆగష్టు 15వ తేది: **వన్ డే యూత్ రిట్రీట్** మరియు
ప్రతి సం॥ అక్టోబర్ 02వ తేది **ఉమెన్స్ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

## జీవపు మాటలు టి.వి. కార్యక్రమాలు

1. **ఆరాధన ఛానల్ :** ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు
2. **శుభవార్త ఛానల్ :** సోమవారము నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు, ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు
3. **కల్వరి ఛానల్ :** ప్రతి రోజు ఉ॥ 9 గం॥లకు & రా॥10.30ని॥లకు

**జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.**

| ప్రతి నెల మొదటి గురువారం<br>**24 గంటలు స్తుతి ఆరాధన**<br>ఉ॥ 6.00 గం॥ల నుండి మరుసటి రోజు<br>ఉ॥ 6.00 గం॥ల వరకు | ప్రతి నెల రెండవ శనివారము<br>**ప్రత్యేక ఉపవాస ప్రార్థన**<br>సమయం: ఉ॥ 9 గం॥ల నుండి<br>సా॥ 5.00 గం॥ల వరకు |
|---|---|
| స్థలం : రాంనగర్, యు.పి.ఎఫ్. ఆలయంలో | |

సేవలో పాలుపొందండి
7901236907

**యు.పి.ఎఫ్. పరిచర్య కొరకు ప్రార్థించగలరు:**
Zoom Meeting ID: 9550504718 Code :7777
E-mail id: joycherian@hotmail.com
www.upf.org.in
Youtube / Joy Cherian - Upf
Facebook / Joy Cherian - Upf
Instagram / Joy Cherian - UPF
9550504718

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862